
ముగిసిన పట్టాభిరాముడి పవిత్రోత్సవాలు



చక్రస్నానం చేయిస్తున్న వేద పండితులు

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : వాల్మీకిపురంలోని శ్రీపట్టాభిరామాలయంలో తితిదే ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న వార్షిక పవిత్రోత్సవాలు గురువారం చక్రస్నానంతో ముగిశాయి. ఇందులో భాగంగా గురువారం సుప్రభాత సేవ, నిత్యసేవలు యథావిధిగా జరిగాయి. ఉదయం 7 గంటలకు యాగశాల వైదిక కైంకర్యాల నిర్వహణ అనంతరం మహా పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా వేద పండితులు పవిత్రాలను తీసుకెళ్లి వైభవంగా పవిత్ర సమర్పణ కార్యక్రమం నిర్వహించారు. తదుపరి పవిత్ర వితరణ, చక్రస్నానంతో వార్షిక పవిత్రోత్సవాలు ముగిశాయి. అనంతరం విశేషాలంకరణలో ముస్తాబైన సీతారాములు తిరుచ్చి వాహనాన్ని అధిరోహించి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో తితిదే డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఆలయాధికారి కృష్ణమూర్తి, అర్చకులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పీజీ స్పాట్ అడ్మిషన్లు ప్రారంభం

వైవీయూ (కడప) : యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్పాట్ అడ్మిషన్లు గురువారం ప్రారంభమయ్యాయి. విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ పర్యవేక్షించారు. ఈ నెల 21వ తేదీ వరకు అడ్మిషన్లు కొనసాగుతాయన్నారు. వి.రామకృష్ణ, ఎన్.గణేష్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రిలో ఆగిన సీబీసీ పరీక్షలు

మరమ్మతులతో మూలకు చేరిన యంత్రం

మదనపల్లె వైద్యం, న్యూస్‌టుడే : మదనపల్లె ప్రభుత్వ సర్వజన బోధనాసుపత్రిలో సీబీసీ పరీక్షలు నిలిచిపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. సీబీసీ సేవలు చేసేందుకు అవసరమైన హెమటాలజీ అనలైజర్ గత 15 రోజులుగా పనిచేయడం లేదు. దీంతో ఆసుపత్రి ల్యాబ్‌లో పరీక్షలు నిలిపేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులు ప్రైవేటు ల్యాబ్‌లలో పరీక్షలు చేయించుకోవాల్సి వస్తోంది. ఆసుపత్రిలో యంత్రం పనిచేయకపోవడంతో ప్రైవేటు ల్యాబ్‌లు సీబీసీ కౌంట్ చేయించుకునేందుకు రూ.200 నుంచి రూ.300 వరకు వసూలు చేస్తున్నారు. గర్భిణులు, వైరల్, డెంగీ జ్వరాలు, రక్తంలో ఏదైనా సమస్య ఉన్నా కంప్లీట్ బ్లడ్ కౌంట్ చేయాల్సి ఉంటుంది. రక్తపరీక్షలకు వచ్చే ప్రతి రోగికి ఈ పరీక్ష అవసరం. యంత్రం మరమ్మతులకు గురికావడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. తిరుపతి నుంచి ఇటీవల యంత్రాలను మరమ్మతులు చేసే సైరెక్స్ విభాగం వారు వచ్చి యంత్రం పూర్తిగా పాడైందని కొత్త యంత్రం తెప్పించుకోవాలని సూచించారు. దీంతో కొత్త యంత్రం కోసం పడిగాపులు కాస్తున్నారు. ఈ విషయమై సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు మాట్లాడుతూ కొత్త యంత్రం కోసం డీఎంఈ అధికారులకు నివేదిక పంపామని, వారు అనుమతితో కొత్త యంత్రం వస్తే వెంటనే సేవలు ప్రారంభిస్తామన్నారు.



మరమ్మతులకు గురైన సీబీసీ పరీక్షలు చేసే హెమటాలజీ యంత్రం

నిర్మాణాలు... అంతటా అక్రమాలు!



గత వైకాపా ప్రభుత్వ హయాంలో అన్నమయ్య, వైఎస్ఆర్ జిల్లాల్లోని జగనన్న కాలనీల్లో చోటుచేసుకున్న అక్రమాలు క్రమంగా వెలుగు చూస్తున్నాయి. ఆ పార్టీ ఎమ్మెల్యేలు, నేతల అండతో సిబ్బంది ఇష్టా రాజ్యంగా వ్యవహరించి నిరుపేదలను నిలువునా మోసగించారు. ఇళ్లు కాదు.. ఊళ్లు కడతామంటూ మాయమాటలు చెప్పి దోపిడీకి పాల్పడ్డారు. ఏ లేఅవుట్‌ను చూసినా అక్రమాలు బయటపడుతున్నాయి. పొరుగుసేవల పేరిట వైకాపా అనుచర వర్గాన్ని అందలమెక్కించి వారి ద్వారా దందా సాగించారు. వారంతా ఇప్పటికీ తిష్టవేసుకుని అక్రమాలు సాగిస్తుండడంతో రూ.కోట్లల్లో అవినీతి చోటుచేసుకుంది. వీటిపై ఎన్డీయే ప్రభుత్వం సమీక్షించి చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

- జగనన్న కాలనీల్లో భారీ దోపిడీ!
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు
- సమగ్ర విచారణతోనే పరిష్కారం

–ఈనాడు, కడప

రాయచోటి పట్టణ సమీపంలోని నారాయణరెడ్డిపల్లె లేఅవుట్‌లో తాజాగా పలు అక్రమాలు వెలుగుచూశాయి. లేఅవుట్‌లో 5,740 ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టగా, భారీ ఎత్తున అక్రమాలు జరిగినట్లు గృహనిర్మాణ సంస్థ విజిలెన్స్ విచారణలో బయటపడింది. లబ్ధిదారులకు కేటాయించిన రూ.15,86,480 విలువ చేసే 21 టన్నుల ఇనుము, రూ.19,80,650 విలువ చేసే 11,318 టన్నుల ఇసుక, సిమెంటు కలిపి మొత్తంగా రూ.35 లక్షల విలువైన సామగ్రిని కాజేసినట్లు తేల్చారు. అవినీతికి బాధ్యులైన సిబ్బందిపై వేటు వేయాలని కలెక్టర్‌ను కోరుతూ సంస్థ ఎండీ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి. వీరిపై చర్యలు తీసుకునే అవకాశం ఎండీ స్థాయిలోనే ఉండగా కలెక్టర్‌కు అప్పగించడం, కొన్నాళ్లపాటు తాత్సారం చేసి పునర్విచారణకు ఆదేశించడం, జిల్లాస్థాయిలో జరిగిన దర్యాప్తుపై అనుమానాలు తలెత్తేవిధంగా నివేదిక వెలువడింది. సంస్థ విజిలెన్స్ విచారణలో వెలుగు చూసిన అక్రమాలపై జిల్లాస్థాయిలో చేపట్టిన విచారణలో కేవలం ఇసుక వరకే పరిమితం చేశారు. దీని వెనుక వైకాపా కీలక నేతల హస్తం ఉన్నట్లు విమర్శలున్నాయి. పునర్విచారణలో ఇనుము, సిమెంటు దోపిడీని తప్పించారనే విమర్శలున్నాయి. పొరుగు సేవల సిబ్బందిని తొలగించగా, వారు స్వాహాచేసిన నిధులను రాబట్టకుండా వదిలేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ కార్యకర్తలను పొరుగు సేవల కింద నియమించి దోపిడీకి పాల్పడ్డారు. హోటళ్లలో పని చేస్తున్న వ్యక్తులు సైతం నారాయణరెడ్డిపల్లె లేఅవుట్‌లో పొరుగు సేవల కింద పని చేశారు. ఈ సిబ్బంది ఆస్తులు అనతికాలంలోనే అమాంతంగా పెరిగిపోవడం రాయచోటి పట్టణంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



కమలాపురం గోదాములో గడ్డకట్టిన సిమెంటు బస్తాలు

● కమలాపురం నియోజకవర్గంలో లబ్ధిదారులను మోసగించారు. గృహ నిర్మాణ సంస్థ సామగ్రి సరఫరా పేరిట తలుపులు, కిటికీలు అందజేసినట్లు నమోదు చేసి బిల్లుల నుంచి మినహాయించుకున్నట్లు బయట పడింది. లబ్ధిదారులకు వాటిని సరఫరా చేయకనే వారి పేరిట నమోదు చేసినట్లు గుర్తించి వారంతా లబోదిబోమంటున్నారు. అక్రమాలపై బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వల్లూరు, కమలాపురం, సీకే దిన్నె మండలాల్లో పనిచేసిన సంస్థ అధికారి అక్రమానికి పాల్పడినట్లు బయటపడింది. సంస్థ ద్వారా సరఫరా చేసిన సామగ్రిని విక్రయించుకుని లబ్ధిదారులను మోసగించినట్లు తేలింది. కమలాపురం గోదాములో 194 బస్తాల సిమెంటు గడ్డకట్టిపోయింది. గోదాములో 15 టన్నుల ఇనుము అందుబాటులో ఉన్నప్పటికీ లబ్ధిదారులకు కేటాయించకుండా తుప్పుపట్టిపోయేలా చేశారు. దీనిపై ఎండీ కార్యాలయం అక్షింతలు వేసింది.

● ముద్దనూరులోనూ అక్రమాలు వెలుగు చూశాయి. గ్రామంలో మూడు లేఅవుట్లలో గృహనిర్మాణాలు జరిగాయి. ఇక్కడ ఇనుము, సిమెంటు, ఇసుక స్వాహా చేసినట్లు సంస్థ పరంగా జరిగిన విచారణలో తేలింది. ఇలా మొత్తంగా రూ.30 లక్షల అవినీతి చోటు చేసుకున్నట్లు అంచనా వేశారు. ఇళ్ల నిర్మాణం ప్రగతిని బట్టి బిల్లులు, సామగ్రి సరఫరా చేయాలి. పునాదుల వరకే ఇళ్ల నిర్మాణం జరిగినప్పటికీ పైకప్పు వేసినట్లుగా చూపిస్తూ సిమెంటు, ఇనుము స్వాహా చేసినట్లు బయటపడింది. దందాలన్నీ బయటకు రావాలంటే లేఅవుట్లలో ఇళ్ల వారీగా విచారణ చేపట్టే పక్షంలో పూర్తిగా వెలుగు చూసే అవకాశం ఉంటుంది.



నారాయణరెడ్డిపల్లె లేఅవుట్‌లో నిర్మాణంలో ఇళ్లు



● పునాదుల వరకే ఇంటి నిర్మాణం చేపట్టాం. గోడలు కట్టలేదు. మాకు తలుపులు, కిటికీలు అందజేసినట్లు నమోదు చేశారు. ఇలా మోసానికి పాల్పడడం ఎంత వరకు భావ్యం.

- షేక్ పాతిమాబీ, ఓబాయపల్లె లేఅవుట్, వల్లూరు మండలం



● సిమెంటు తీసుకోనప్పటికీ మా ఖాతాలో 40 బస్తాలు పొందినట్లు నమోదు చేశారు. బయట మార్కెట్‌లో కొనుగోలు చేసి ఇంటి నిర్మాణం చేపట్టాం. తప్పుడు లెక్కలు రాసి మమ్మల్ని మోసం చేశారు.

- గంగులమ్మ, ఓబాయపల్లె, వల్లూరు మండలం

అదనపు బాధ్యతల పేరిట సీనియర్లకు అన్యాయం

జలవనరులశాఖలో ఇదేమి చోద్యం?

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం అదనపు బాధ్యతల పేరిట సీనియర్లకు తీరని అన్యాయం చేస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మదనపల్లె జలవనరుల శాఖ (హెచ్ఎన్ఎస్ఎస్ సర్కిల్-3)లో ఇలాంటి వివాదాస్పద సమస్యే బయటపడింది. డీఈఈలను తొలగించి ఏడేళ్ల జూనియర్లుగా ఉన్నవారిని డీఈఈ, ఈఈ స్థాయి ఉద్యోగోన్నతులు కల్పించి సీనియర్లుగా ఉంటూ అర్హులైన వారికి ఉద్యోగోన్నతులు కల్పించడంలో తీరని అన్యాయం చేశారని బాధితులు వాపోతున్నారు. 2007 బ్యాచ్‌కు చెందిన ఇంజినీరింగ్ అధికారులను పక్కనపెట్టి 2012 బ్యాచ్‌కు చెందిన ఏఈఈకి అదనపు బాధ్యతల పేరిట డీఈఈగా ఉద్యోగోన్నతి కల్పించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇదే సర్కిల్‌లో 1989, 1992 బ్యాచ్‌కు చెందినవారిని పక్కనపెట్టి 1996 బ్యాచ్‌కు చెందినవారికి చట్టవిరుద్ధంగా ఈఈలుగా నియమించి నట్లు సమాచారం. ఇందులో ఒక డీఈఈకే రెండు అదనపు పోస్టులు, ఈఈ బాధ్యతలను అప్పగించినట్లు తెలిసింది. గురువారం ప్రకటించిన అదనపు బాధ్యతల జాబితాలో జూనియర్లను డీఈఈ, ఈఈలుగా నియమించడంపై ఆ శాఖలో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ప్రభుత్వం పునరాలోచించి తగిన చర్యలు చేపట్టాలని సీనియర్ ఇంజినీర్లు కోరుతున్నారు.

తడిసి ముద్దయిన మదనపల్లె ప్రభుత్వాసుపత్రి



ప్రసూతి వార్డులో పైకప్పు నుంచి ఉరుస్తున్న వర్షపునీరు

మదనపల్లె వైద్యం, న్యూస్‌టుడే : మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం, గుత్తేదారుల చేతివాటంతో పై అంతస్తుతో పాటు కిందనున్న భవనం పైకప్పు ఉరుస్తోంది. తుపాను కారణంగా గత మూడు రోజులుగా మదనపల్లెలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఆసుపత్రిలో ఇటీవలే వైద్య కళాశాల కోసమని రూ.9 కోట్లతో తాత్కాలిక భవనాలు నిర్మించారు. పర్యవేక్షణ లోపంతో తూతూ మంత్రంగా నిర్మాణాలు చేపట్టారు. దీంతో మొదటి నుంచి వర్షాలకు కొన్ని గదులు ఉరుస్తున్నాయి. ప్రస్తుతం ప్రసూతి విభాగం ఉన్న ప్రాంతంలో వరండా మొత్తం తడిసిపోతోంది. ఈ మార్గంలో గర్భిణులు వెళ్లే సమయంలో జారి పడితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. పది నిమిషాలకొకసారి శుభ్రం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గోడల్లో నాణ్యత లోపంతో నీరంతా కింద ఉన్న వార్డులోకి వస్తోంది. అధికారులు సంబంధిత గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని రోగులు, ఆసుపత్రి అధికారులు కోరుతున్నారు. దీంతో పాటు ఆసుపత్రిలోని పేయింగ్ వార్డులు, ఐసీయూ వార్డు ఉరుస్తోంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించకుంటే వర్షాకాలం మొత్తం ఇబ్బంది పడాల్సి ఉంటుందని రోగులు వాపోతున్నారు. ఆసుపత్రిలో తాత్కాలిక భవనాల నిర్మాణాలకు స్ట్రెచర్ వెళ్లే మార్గంలోని రేకులను తొలగించారు. వర్షం సమయంలో రోగులను వార్డులోకి తీసుకెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. అదే మార్గంలో ఎస్ఎన్‌సీయూ, పురుషుల, మహిళల జనరల్ వార్డుకు వెళ్లాల్సి ఉంటుంది. తొలగించిన రేకులు ఏర్పాటు చేయాలని రోగులు, వారి సహాయకులు కోరుతున్నారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు మాట్లాడుతూ ఏపీఎంఎస్ఐడీసీ అధికారులకు ఇదివరకే మరమ్మతులు చేయాలని చెప్పామని, పట్టించుకోకపోవడంతో సమస్య తలెత్తిందన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా వాల్మీకి జయంతి

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : మూలరామాయణ రచయిత, సర్వమానవాళికి మార్గదర్శకుడు వాల్మీకి మహర్షి అని వాల్మీకి సంఘం నాయకుడు బ్యాంకు రెడ్డెప్ప పేర్కొన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా వాల్మీకిపురంలో గురువారం సంఘం నాయకులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక పట్టాభి రామాలయంలోని శ్రీవాల్మీకి మహర్షి విగ్రహానికి పంచామృతాభిషేకంతో పాటు విశేష పూజలు నిర్వహించారు. మదనపల్లె రోడ్డులోని వాల్మీకి విగ్రహం వద్ద విశేష పూజలతో పాటు సహపంక్తి భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. చింతపర్తిలో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి విగ్రహం వద్ద విశేష పూజలు, పుష్పాంజలి కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రెడ్డెప్ప, రెడ్డిరాం, టైలర్‌రాజు, నరసింహులు, శ్రీనాథ్, పనికుమార్, దండువారిపల్లె రమణ, విష్ణుచైతన్య, రమేష్, శంకర, శ్రీనివాసులు, నారాయణ, బాబు తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకిపురంలో పుష్పాంజలి కార్యక్రమంలో పాల్గొన్న వాల్మీకులు

దారి లేక... దాటలేక!



రైల్వేకోడూరు-రెడ్డివారిపల్లె మధ్య గుంజనేరుపై హైలెవల్ వంతెన నిర్మాణమవుతోంది. అది పూర్తయ్యేవరకు ప్రజల రాకపోకలకు తాత్కాలికంగా మట్టి రహదారి నిర్మించారు. తుపాను ప్రభావంతో గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మట్టి కొట్టుకుపోగా సిమెంటు గొట్టాలు మిగిలాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో రెడ్డివారిపల్లె ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలో నిర్మాణంలో ఉన్న తన ఇంటిని చూసేందుకు గురువారం రైల్వేకోడూరు పట్టణానికి చెందిన కొండపల్లి మల్లీశ్వరి తన పిల్లలతో కలిసి వెళ్లి ఇబ్బందులు పడుతుండడాన్ని చిత్రంలో చూడొచ్చు. **-న్యూస్‌టుడే, రైల్వేకోడూరు**

మౌలిక వసతులు మృగ్యం!

కలికిరి, న్యూస్‌టుడే: కలికిరిలోని ఇంటిగ్రేటెడ్ (సమీకృత సాంఘిక సంక్షేమ బాలుర) వసతి గృహంలో మరుగుదొడ్లు అస్తవ్యస్తంగా మారాయి. ఇక్కడ పది మరుగుదొడ్లు ఉండగా.. అందులో ఐదు మరమ్మతులకు గురయ్యాయి. మొత్తం 95 మంది విద్యార్థులున్న వసతి గృహం వెంటిలేటర్లు, కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేయలేదు. వీటి స్థానంలో అట్టముక్కలతో అడ్డం పెట్టారు. కనీసం గోడలకు సున్నం వేయకపోవడంతో మసిబారిపోయాయి. శాశ్వత ప్రాతిపదికన వార్డెన్‌ను నియమించడంలో జాప్యం జరుగుతుండడంతో గత నాలుగేళ్లుగా ఇన్‌ఛార్జులతో సాగుతోంది. ఈ విషయమై ఏఎస్‌డబ్ల్యూ జయప్రసాద్ మాట్లాడుతూ వసతి గృహంలో మౌలిక వసతుల కల్పనకు నాడు-నేడు పథకం కింద రూ.6 లక్షల అంచనాలతో అభివృద్ధి పనులపై నివేదికలు పంపినా అప్పటి వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వంలో వసతి గృహం మౌలిక వసతులు మెరుగుపర్చేందుకు నివేదికలు పంపి అన్ని సౌకర్యాలు మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



వసతి గృహంలో వెంటిలేటర్లకు అడ్డంగా పెట్టిన అట్టలు



మరమ్మతులకు గురైన మరుగుదొడ్లు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

నూరు శాతం అక్షరాస్యతే లక్ష్యం : కలెక్టర్

రాయచోటి, న్యూస్‌టుడే : జిల్లాలో నూరు శాతం అక్షరాస్యత సాధించాలనే లక్ష్యంతో అధికారులు పని చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. జాతీయ విద్యా విధానం-2020 అనుగుణంగా ఉల్లాస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఎస్‌హెచ్‌జీలు, ఆయాలు, వంట వండే వారు, వివిధ రకాల సహాయకులు, కార్యాలయాల కాపలాదారులను అక్షరాస్యులుగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో 13,767 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు రెండు గంటలపాటు శిక్షణ తరగతులకు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, డీఈవో శివప్రకాష్‌రెడ్డి, డీపీవో బాలకృష్ణారెడ్డి, జీఎస్‌డబ్ల్యూవో లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

జలపాతం కనువిందు

కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలో గువ్వలచెరువు ఘాట్‌రోడ్డులోని జలపాతం కనువిందు చేస్తోంది. తుపాను ప్రభావంతో గత మూడు రోజులుగా శేషాచల అడవుల్లో కురిసిన భారీ వర్షాలకు నీటి ప్రవాహం పెరగడంతో రహదారిపై రాకపోకలు సాగించే ప్రయాణికులు తమ చరవాణుల్లో జలపాతం అందాలను బంధిస్తున్నారు. స్థానికులు జలపాతం వద్దకు చేరుకుని ఆనందంగా గడుపుతున్నారు. **-న్యూస్‌టుడే, రామాపురం**



నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం



సీతమ్మ మాంగల్యాన్ని చూపుతున్న అర్చకులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయంలో పౌర్ణమి సందర్భంగా గురువారం సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ నేత్రపర్వంగా నిర్వహించారు. తొలుత జానకీరాములను పట్టువస్త్రాలు, పుష్పమాలికలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. అర్చకులు ఆధ్వర్యంలో రాములోరి పరిణయ ఘట్టం కమనీయంగా జరిగింది. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ తనిఖీ అధికారి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

వెలిగల్లులో 2.50 టీఎంసీల నీటి నిల్వ

గాలివీడు, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు వెలిగల్లు జలాశయంలో నీటి మట్టం పెరుగుతోంది. జలాశయం గరిష్ట నీటి సామర్థ్యం 4.64 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 2.50 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. ఎగువ నుంచి 450 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి చేరుతోంది. ఎడమ కాలువకు రెండు క్యూసెక్కులు, రాయచోటి, గాలివీడు మంచినీటి పథకాలకు ఆరు క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని డీఈఈ శిరీష్‌కుమార్ పేర్కొన్నారు. జలాశయాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఎగువ నుంచి నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉండడంతో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఎప్పుడికప్పుడు నీటి నిల్వలను పరిశీలించి సమాచారమివ్వాలని ఆదేశించారు. ఆయనవెంట ఏఈ సాంబశివుడు, సిబ్బంది ఉన్నారు.

వర్షార్పణం!

జిల్లాలోని వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం



పెనగలూరులో నేలవాలిన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

–న్యూస్‌టుడే, రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, రాజంపేట గ్రామీణ, సుండుపల్లి, పెనగలూరు

జిల్లాలో గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు నియోజకవర్గాల్లో 280 ఎకరాల్లో అన్ని రకాల పంటలు దెబ్బతిన్నాయి. వరి, టమాట, బొప్పాయి, అరటి తోటలపై తీవ్ర ప్రభావం చూపింది. జిల్లాలో 139 మంది రైతులకు చెందిన 99 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ తెలిపారు. ఉద్యాన పంటలైన అరటి, బొప్పాయి, టమాట 31.5 ఎకరాల్లో దెబ్బతినగా, 20 మంది రైతులకు రూ.26.10 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీంద్రబాబు పేర్కొన్నారు. రాజంపేట మండలం తాళ్లపాక, మంద పల్లి, గుండ్లూరు, పోలి, అప్పారాజుపేట గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంటలను గురువారం రాజంపేట ఇన్‌ఛార్జి ఏడీ పవన్‌కుమార్ రైతులతో కలిసి పరిశీలించారు. మండలంలో 47.5 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. పెనగలూరు మండలంలో దెబ్బతిన్న వరి, వేరుసెనగ పంటలను ఏవో పవన్ కుమార్ పరిశీలించారు. మొత్తం 21 హెక్టార్లలో వరి పంట దెబ్బతినడంతో రూ.24.78 లక్షలు, వేరుసెనగ 2 హెక్టార్లలో దెబ్బతినడంతో రూ.2.17 లక్షల నష్టం వాటిల్లినట్లు తెలిపారు. వరి పంటకు సంబంధించి నందలూరు మండలంలో 51 హెక్టార్లు, చిట్వేలిలో 3, పీలేరులో 2, రైల్వేకోడూరు, సుండుపల్లి మండలాల పరిధిలో ఒక్కో హెక్టారుకు చొప్పున నష్టం వాటిల్లింది. ఉద్యాన పంటలకు సంబంధించి రైల్వేకోడూరు మండలంలో 5.5 ఎకరాల్లో అరటి, పెనగలూరు, గాలివీడు మండలాల్లో బొప్పాయి 25, రామాపురం మండల పరిధిలో ఎకరా విస్తీర్ణంలో టమాట తోటలు దెబ్బతిన్నాయి.

ప్రభుత్వమే ఆదుకోవాలి



మొత్తం 2.5 ఎకరాల్లో రూ.1.50 లక్షల పెట్టుబడితో టమాట, ఎకరాలో రూ.80 వేలు ఖర్చు చేసి వరి సాగు చేశాను. టమాట చేతికొచ్చి మంచి లాభాలు వస్తాయనుకునేలోపు భారీ వర్షాలు కురవడంతో పంట పూర్తిగా దెబ్బతింది. సాగు చేసిన వరి పంట సగం వరకు పూర్తిగా నేలమట్టమైంది. దీంతో తీవ్రంగా నష్టపోయాం. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

-వెంకటశివమ్మ, నెహ్రూనగర్, మద్దిరేవుల, లక్కిరెడ్డిపల్లె మండలం

సీఏ ర్యాంకరుకు సీఎం అభినందన

ములకలచెరువు, న్యూస్‌టుడే: సీఏలో అఖిల భారత స్థాయిలో 14వ ర్యాంకు సాధించిన విద్యార్థినిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభినందించారు. తంబళ్లపల్లె మండలం కన్నెమడుగుకు చెందిన కె.రఘురాంరెడ్డి, నాగవేణి దంపతుల కుమార్తె తేజశ్విని గుంటూరు మాస్టర్ మైండ్స్‌లో సీఏ చదివింది. రైతు కుటుంబానికి చెందిన విద్యార్థి పట్టుదలతో చదివి సీఏ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపి 14వ ర్యాంకు సాధించింది. ఆగస్టులో విడుదలైన ఫలితాల్లో ఆల్ ఇండియాలో ఫస్ట్ ర్యాంకు సాధించింది. రాష్ట్ర సచివాలయంలో తేజశ్విని, తండ్రి రఘురాంరెడ్డి, బాబాయ్ అమరనాథ్‌రెడ్డితో కలిసి బుధవారం సాయంత్రం సీఎం చంద్రబాబుని పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థినిని సీఎం అభినందించి ప్రశంసించారు.



సీఏ ఆల్ ఇండియా ర్యాంకరును అభినందిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

తెదేపా పాలనలో బీసీలకు ప్రత్యేక చట్టం

రామసముద్రం, న్యూస్‌టుడే: తెదేపా పాలనలో బీసీల కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. రామసముద్రంలో గురువారం వాల్మీకి కులస్థుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున జయంతోత్సవం జరిగింది. ఈ సందర్భంగా మహర్షి విగ్రహానికి పూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెదేపా ఆవిర్భావం నుంచి బీసీల సంక్షేమం కోసమే పనిచేసిందని అభినందించారు. అయితే వైకాపా పాలనలో వాల్మీకులకు ఏం న్యాయం జరిగిందని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికి వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామన్న జగన్ హామీ నీటిమూటగా మారిందని ఎద్దేవా చేశారు. కేవలం కమిటీ నియామకం చేసి కాలయాపన చేసిందని మండిపడ్డారు. వాల్మీకులకు న్యాయం జరిగేందుకు వారి పక్షంలో నిలుస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో వాల్మీకులకు ప్రత్యేకంగా 150 ప్రభుత్వ గృహాలను మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ గౌడు, సీనియర్ నాయకులు కృష్ణమరాజుయాదవ్, రాజేష్, గౌనివారిపల్లె రెడ్డెప్పరెడ్డి, పెద్దిరెడ్డి, వాల్మీకిసంఘ నాయకులు ఆనందప్ప, తలారి శ్రీనివాసులు, మేస్త్రీ నరసింహులు, కిట్ట, టేకుపల్లె రమణ, రామూర్తి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, పక్కన నాయకులు

నిత్యావసర సరకులు పంపిణీ చేయాలి

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేద ప్రజలకు నిత్యావసర సరకులు పంపిణీ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ అన్నారు. గురువారం సంతగేటు వద్ద ఉన్న ఏఐటీయూసీ కార్యాలయంలో సమావేశం జరిగింది. పెరుగుతున్న నిత్యావసర సరకులు ధరలు అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 16 రకాల నిత్యావసర సరకులు అందజేయాలన్నారు. ధరలను తగ్గించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. నిత్యావసర సరకులు ధరలు భారీగా పెరగడం వల్ల సామాన్య ప్రజలు జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. నిరుద్యోగ సమస్య, వ్యవసాయ సంక్షోభం, గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేని కారణంగా ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయిందన్నారు. ఇలాంటి పరిస్థితిలో ధరల ప్రభావం ప్రజలను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. రాష్ట్రంలో ఆహార ధాన్యాలు సమృద్ధిగా ఉన్నప్పటికీ కిలో బియ్యం రూ.80 దాటిందన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ రాలేదన్నారు. ఎన్నికల ముందు భాజపా ప్రభుత్వం ధరలను అదుపులోకి తెస్తామని ప్రకటించిందన్నారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెరుగుతున్న ధరలను నియంత్రించడానికి తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు తిరుమల, మురళి పాల్గొన్నారు.

కార్మికులకు వరం... సంక్షేమ చట్టం

అయిదేళ్లకొకసారి రుసుం చెల్లింపు

నవీకరించుకుంటే భవితకు రక్ష

పీలేరు, న్యూస్‌టుడే: దినసరి కార్మికుల సంక్షేమ కోసం ప్రభుత్వం కార్మికుల సంక్షేమ చట్టం అమలు చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకుని భవన నిర్మాణ, ఇతర కార్మికులు తక్కువ రుసుంతో లబ్ధిపొందాలని కార్మికశాఖ కోరుతోంది. పథకాన్ని కార్మికులకు వివరించేందుకు సమాజంలో ఉన్న వివిధ రకాల కార్మికులకు అవగాహన కల్పించిందేందుకు కరపత్రాలను పంపిణీ చేస్తోంది. భవన, ఇతర నిర్మాణ కార్మికుల చట్టం, 1996, ఆంధ్రప్రదేశ్ నిబంధనలు, 1999 ప్రకారం కార్మికులు పథకంలో సభ్యులుగా చేరి లబ్ధిపొందేందుకు అవకాశం ఉంటుంది. కార్మిక సంఘం నాయకులు, ఆటో సంఘం నాయకులు, సభ్యులు ఈ పథకంలో గుర్తింపు కార్డులు తీసుకుంటే భవిష్యత్తులో సమస్య వచ్చినప్పుడు లబ్ధిపొందేందుకు అర్హులవుతారు.

నమోదుకు అర్హతలివి...

★ భవన నిర్మాణ, ఇతర రంగాల్లో పనిచేసే కార్మికుల సంక్షేమానికి ఈ చట్టం రూపొందించారు. ★ లబ్ధిదారులుగా నమోదు చేసుకొనుటకు (సెక్షన్-12) ప్రకారం భవన, ఇతర నిర్మాణ రంగాల్లో కార్మికులై ఉండాలి. ★ 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాలలోపు వయసు కలిగి ఉండాలి. వయస్సు ధ్రువీకరణకు రేషన్‌కార్డు, ఓటర్ కార్డు, జనన, స్కూలు ధ్రువీకరణ పత్రాలు జతచేయాలి. ★ నమోదు చేయగోరు రోజుకు ముందు గత పన్నెండునెలల్లో 90 రోజులకు తక్కువ కాకుండా భవన, ఇతర నిర్మాణ రంగంలో పనిచేసి ఉండాలి. ★ కార్మికులు నమోదు రుసుం రూ.110 (50+60) చెల్లించి సంబంధిత కార్మికశాఖాధికారిచే అయిదు సంవత్సరాలకు ఒకేసారి నమోదు చేసుకోవాలి. తరువాత రూ.60 చెల్లించి అయిదు సంవత్సరాలకు ఒక పర్యాయం నవీకరణ చేయించుకోవాలి. ★ నిర్మాణ రంగ యజమాని గాని (బిల్డరు) కార్మిక సంఘాల అభ్యర్థన మేరకు, వ్యక్తిగతంగా ధ్రువీకరించుకొన్న తరువాత కార్మికశాఖలో సహాయ కార్మిక అధికారి స్థాయికి తక్కువగాని అధికారి ధ్రువీకరణ పత్రం ఇస్తారు. ★ రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, ఒకటి దరఖాస్తుపై అంటించవలెను. రెండవ ఫోటో వెనుక భాగంలో కార్మికుడి పేరు రాసి కవరులో పెట్టి దరఖాస్తుకు జత చేయాలి.

కార్మికుల వివరాలివి	
ఉమ్మడి చిత్తూరు జిల్లా	: 1,44,323
ఉమ్మడి కడప జిల్లా	: 66,553
ఇప్పటి వరకు నవీకరణ (రెన్యువల్) చేసుకున్న వారు	
ఉమ్మడి చిత్తూరు జిల్లా	: 8,766
ఉమ్మడి కడప జిల్లా	: 250

సంక్షేమ బోర్డు అందించే పథకాలు

★ పనిచేసే ప్రదేశాల్లో ప్రమాదంలో మృతి చెందినా, లేదా పూర్తి అంగ వైకల్యం పొందిన వారికి రూ.ఐదు లక్షలు, ★ 50 శాతం అంతకుమించి అంగ వైకల్యం కలిగిన వారికి రూ.లక్ష, ★ 26 నుంచి 49 శాతం వరకు అంగ వైకల్యం కలిగిన వారికి రూ.50 వేలు, ★ 25 శాతం వరకు అంగవైకల్యం కలిగిన వారికి రూ.25 వేలు పొందేందుకు అర్హత ఉంటుంది. ★ సాధారణంగా మృతి చెందిన వారికి రూ.60 వేల ఆర్థిక సాయం ★ వివాహితకు ప్రసూతి సాయం రూ.20 వేలు (రెండు ప్రసవాల వరకు మాత్రమే) అర్హులు. ఈ పథకం కార్మికుని భార్యకు లేదా ఇద్దరు కుమార్తెలకు కూడా వర్తించును. వీరు గుర్తింపు కార్డు పొందిన పన్నెండు నెలలు తరువాత ప్రసవం అయిన ఆరు నెల్లోపు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. భవన నిర్మాణ కార్మికులు అనారోగ్య సమయంలో జారీ చేసే ఆర్థిక సాయం రోజుకు రూ.300 వంతున నెలకు రూ.మూడు వేలకు మించకుండా (మూడునెలల వరకు) ★ దహన సంస్కార ఖర్చులకు రూ.20 వేలు, ప్రమాదంలో మృతి చెందిన కార్మికుని పార్థీవ శరీరం స్వగ్రామానికి అంబులెన్స్ ద్వారా తరలించడానికి తక్షణ ఆర్థిక సాయం సంబంధిత డిప్యూటీ కార్మికశాఖ కమిషనర్ల ద్వారా చెల్లిస్తారు. జాతీయ నిర్మాణ శిక్షణ సంస్థ (ఎన్‌ఏసీ) ద్వారా కార్మికులకు ఎలక్ట్రికల్, తాపీ పని, ప్లంబింగ్, పెయింటింగ్, బార్ బెండింగ్, వడ్రంగి విభాగాల్లో శిక్షణ కార్యక్రమాలు, శిక్షణ కాలంలో రోజుకు రూ.300 శిక్షణ భృతి, ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తారు. ★ జాతీయ పింఛను పథకం పొందేందుకు ఏ పింఛను పథకం కింద సభ్యులుగా నమోదు కాని వారై ఉండాలి. బోర్డు ద్వారా గుర్తింపు కార్డు పొందిన కార్మికులై ఉండాలి, 18 నుంచి 59 సంవత్సరాలలోపు వయసు ఉండాలి. ★ వివాహ కానుక పొందేందుకు బోర్డు ద్వారా గుర్తింపు కార్డు పొందిన వివాహం కాని మహిళా కార్మికులకు, లబ్ధిదారు కుమార్తెలకు ఈ పథకం ద్వారా రూ.10 వేలు ఆర్థిక సహాయం లభించును.



భవన నిర్మాణ కార్మికులకు కరపత్రాలు అందజేస్తున్న కార్మికశాఖ అధికారి ఆనందబాబు

ప్రయోజనాలను వివరిస్తున్నాం

కార్మికశాఖ ద్వారా ధ్రువపత్రం, కార్డులు పొందిన వారికి అందించే ప్రయోజనాలను ప్రత్యేక సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. అర్హులు ఏరోజైనా పథకంలో చేరి సభ్యత్వం పొందేందుకు చట్టం అవకాశం కల్పించింది. భవన నిర్మాణ కార్మికులతో పాటు ఇతర రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు కూడా ఈచట్టం ద్వారా ప్రయోజనాలు పొందేందుకు అర్హులు. అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

- ఆనంద్, సహాయ కార్మికాధికారి, పీలేరు

తెదేపా నేతపై లైంగిక వేధింపుల ఆరోపణలు

సామాజిక మాధ్యమాల్లో వీడియోలు హల్‌చల్

ఈనాడు, కడప, న్యూస్‌టుడే, రాయచోటి: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటికి చెందిన తెదేపా రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా మహిళలపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ మేరకు వీడియోలు సామాజిక మాధ్యమాలు, ఛానళ్లలో హల్‌చల్ చేశాయి. మహిళలతో అసభ్యకరంగా వ్యవహరిస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడంతోపాటు పలు ఛానళ్లలో ప్రసారమయ్యాయి. తనకు పింఛను, ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానంటూ ఆశ చూపించి లైంగికంగా వేధించారని పోలీసులకు ఓ మహిళ ఆరోపించారు. తనకు జరిగిన అన్యాయంపై ఎస్పీకి ఫిర్యాదు చేస్తానన్నారు. అయితే ఆ తర్వాత ఫిర్యాదు చేయకుండా వెళ్లారు. సదరు నేత తీరుపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీలో తన హోదాను అడ్డుపెట్టుకుని అసాంఘిక కార్యకలాపాలు నడుపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నేత తీరుపై పార్టీ అధిష్ఠానం ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయన వ్యవహారశైలిపై నివేదిక కోరినట్లు తెలిసింది.

ఇసుక రీచ్ ప్రారంభం

నందలూరు, న్యూస్‌టుడే : నందలూరు మండలంలోని టంగుటూరు ఇసుక రీచ్‌ను గురువారం రాజంపేట సబ్ కలెక్టర్ వైష్ణవిదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఇసుకను లబ్ధిదారులకు అందించాలని సంబంధిత గుత్తేదారుకు సూచించారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ భువనబోయిన లక్ష్మీనరసయ్య, టంగుటూరు సర్పంచి మైనుద్దీన్, ఎంపీటీసీ సభ్యుడు పెంచలయ్య, నాయకులు చుక్కా యానాది, కొండయ్య, షర్మిళ, రాము యాదవ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరులో జిల్లావాసి దారుణ హత్య

- కారణాలపై దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు
- అక్రమ సంబంధమా? ఆర్థిక లావాదేవీలా?

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని రాచవేటివారిపల్లె పంచాయతీ గుండ్లబురుజుకు చెందిన శెట్టిపల్లె రమణ, నాగమ్మ దంపతుల కుమారుడు బాలాజీ (24) కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరులో హత్యకు గురయ్యాడు. మృతుని తల్లిదండ్రులు గ్రామస్థుల వివరాల మేరకు... బాలాజీ ఏడాది క్రితం బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తు అద్దె గదిలో ఉంటున్నాడు. రామసముద్రం మండలానికి చెందిన రెడ్డెప్పరెడ్డి బెంగళూరులోని ఓ కంపెనీలో పనిచేస్తు ఆవులహళ్లిలో కాపురం ఉన్నాడు. బాలాజీకి రెడ్డెప్పరెడ్డికి పరిచయం ఏర్పడడంతో ఇద్దరు సన్నిహితంగా ఉండేవారని సన్నిహితుల ద్వారా పోలీసులు గుర్తించారు. ఆదివారం నుంచి బాలాజీ చరవాణి మోగుతున్నా తియ్యక పోవడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు కుమారుడున్న గదికి వెళ్లగా అక్కడ కన్పించలేదు. స్థానికులను విచారించి అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పోలీసులు బాలాజీ మృతిచెందిన ప్రాంతాన్ని గుర్తించారు. మృతదేహం ఉబ్బిపోయి ఉండడం చూస్తే హత్య జరిగి మూడురోజులై ఉండవచ్చని పోలీసులు గుర్తించారు. బాలాజీ ఈ నెల 13వతేదీ తన గది నుంచి స్నేహితుడు రెడ్డెప్పరెడ్డి పిలుపు మేరకు అక్కడకు వెళ్లాడు. అక్కడ ఇద్దరు మద్యం సేవించినట్లు సమాచారం. అక్కడ ఏం జరిగిందో తెలియదు కానీ కొడవలితో బాలాజీని నరికి చంపిన గుర్తులున్నాయి. రెడ్డెప్పరెడ్డి తన భార్యను వారం రోజుల ముందే పుట్టింటికి పంపి ఈ హత్యకు పాల్పడినట్లు బెంగళూరు పోలీసులు మృతుని బంధువులకు తెలిపినట్లు సమాచారం. అయితే హత్యకు కారణాలు అక్రమ సంబంధమా? లేక ఆర్థిక లావాదేవీలా? అన్నది పోలీసుల దర్యాప్తులో నిర్ధారించాల్సి ఉంది. హత్య జరిగిన ఇంటిలో రెడ్డెప్పరెడ్డితో పాటు కుటుంబ సభ్యులు లేకపోవడం పలు అనుమానాలకు దారితీస్తోంది. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు వచ్చారు. తల్లిదండ్రులకు బాలాజీ ఒక్కడే కుమారుడు కావడంతో వారి రోదనలు మిన్నంటాయి. యువకుడి మృతితో గ్రామంలో విషాదం అలముకుంది. నిమ్మనపల్లె ఎస్ఐ తిప్పేస్వామిని వివరణ కోరగా ఈ ఘటనపై తమకు ఎలాంటి సమాచారం అందలేదన్నారు.



బాలాజీ (పాత చిత్రం)

ఒకే ఈతలో రెండు పెయ్య దూడలు

చిన్నమండెం, న్యూస్‌టుడే : అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండల పరిధిలోని సి.పొలిమేరపల్లె గ్రామం కాయలవాండ్లపల్లెలో రైతు శ్రీనివాసులుకు చెందిన సంకరజాతి పాడిఆవు గురువారం ఒకే ఈతలో రెండు పెయ్య దూడలకు జన్మనిచ్చింది. రెండు దూడలు ఆరోగ్యంగా ఉన్నాయని, ఒకే ఈతలో రెండు దూడలు జన్మించడం అరుదుగా జరుగుతుందని పశువైద్యుడు గణేష్ తెలిపారు. ఈ విషయంపై జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ కె.గుణశేఖరపిళ్లై మాట్లాడుతూ.. లింగనిర్ధారిత వీర్య నాళికలు ఉపయోగించి ఎదసూదులు వేయడం ద్వారా 90 శాతం పెయ్య దూడలే జన్మిస్తాయన్నారు. కొన్ని ఆవుల్లో వంశపారం పర్యంగా రెండు దూడలకు జన్మనిస్తాయని స్పష్టం చేశారు. ఎద సూదులు వేసిన సమయంలో రెండు అండాలు విడుదలై సంయోగం చెంది రెండు పిండాలుగా ఏర్పడడంతో కవల దూడలు జన్మిస్తాయని వివరించారు.



రెండు పెయ్య దూడలకు జన్మనిచ్చిన సంకరజాతి పాడిఆవు

వాల్మీకి మహర్షి నేటి తరానికి స్ఫూర్తి ప్రదాత

రాయచోటి, న్యూస్‌టుడే: వాల్మీకి మహర్షికి జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి మహర్షి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరు జీవితంలో ముందుకు సాగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ చిన్నికృష్ణ, ఏవో బి.కృష్ణుడు, ఆర్ఐ వి.జె.రామకృష్ణ, పోలీసు మోటారు వాహనాల తనిఖీ అధికారి ఎం.పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లె(రాయచోటి): వాల్మీకి మహర్షి నేటి తరానికి స్ఫూర్తి ప్రదాత అని జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. సంబేపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం.నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయచోటి : వాల్మీకి జయంతి వేడుకలు గురువారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమన్నారు. డీఆర్వో సత్యనారాయణరావు, ఏవో నాగభూషణం, బీసీ సంక్షేమ అధికారి సందప్ప, వాల్మీకి సంఘ అధ్యక్షుడు భక్తవత్సలం, వాల్మీకి సేవాదళ్ అధ్యక్షుడు మూగిరెడ్డెప్ప, యోగా నందబాబు, కురబలకోట, చిన్నరెడ్డి బోయ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం : మూల రామాయణ రచయిత, సర్వ మానవాళికీ మార్గదర్శకుడు అయిన వాల్మీకి మహర్షి అని వాల్మీకి సంఘం నాయకులు బ్యాంకు రెడ్డెప్ప అన్నారు. గురువారం వాల్మీకి జయంతి సందర్భంగా మండలంలోని వాల్మీకులంతా కలిసి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తదుపరి స్థానిక పట్టాభి రామాలయంలోని శ్రీవాల్మీకి మహర్షి విగ్రహానికి పంచామృతాభిషేకంతో పాటు విశేష పూజలు నిర్వహించారు. తదుపరి మదనపల్లె రోడ్డులోని వాల్మీకి విగ్రహం వద్ద విశేష పూజలతో పాటు సహపంక్తి భోజన కార్యక్రమాల్లో వాల్మీకులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, అధికారులు

పూజారుల ఆధిపత్య పోరుతోనే ఆలయం కూల్చివేత

- నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి, న్యూస్‌టుడే : ఆలయం ద్వారా వచ్చే ఆదాయాన్ని పొందేందుకు పూజారుల మధ్య తలెత్తిన వివాదమే ములకలచెరువులో అభయహస్త ఆంజనేయస్వామి ఆలయం ధ్వంసానికి కారణమని ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం సాయంత్రం ఎస్పీ వివరాలు వెల్లడించారు. ఫిర్యాదుదారు విద్యాసాగర్‌కు కనుగొండస్వామి ఆలయంలో పూజారిగా ఉన్న హరినాథ్ యాదవ్‌కు గొడవలున్నాయి. ఆంజనేయస్వామి గుడిని తన స్వాధీనంలోకి తీసుకొని తద్వారా వచ్చే ఆదాయాన్ని తానే పొందాలని హరినాథ్ యాదవ్ పథకం పన్నాడు. అందుకు విద్యాసాగర్ అంగీకరించలేదు. దీంతో గుడిని కూల్చివేస్తే విద్యాసాగర్ అక్కడ నుంచి వెళ్లిపోతారని భావించి మరో కొంతమందితో కలిసి గుడి కింద గుప్త నిధులు ఉన్నాయని నమ్మబలికాడు. వారం రోజుల కిందట శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం సదుం గ్రామానికి చెందిన వెంకటరమణ, అశోక్‌ల నుంచి పేలుడు పదార్థాలతో ఆలయం పేల్చే ప్రయత్నం చేసినా పేలలేదు. ఈ నెల 14న మొలక మహేశ్వర్‌రెడ్డి, తిరుమణి లక్ష్మీనారాయణ, బుచ్చిపల్లి రాఘవేంద్రాచారి, చాకివేలు మధు, షేక్ ఇలాహీలతో కలిసి హరినాథ్ ఇనుప గడ్డపారలు, సుత్తి, సమ్మెట, రాళ్లు చెక్కే ఉలి వంటి వాటితో ఆంజనేయస్వామి ఆలయ గోడలను ధ్వంసం చేశారు. ఆలయ ధ్వంసంలో ఎలాంటి మత పరమైన చర్యలు లేవని స్పష్టం చేశారు. పూజారుల మధ్య తలెత్తిన వివాదమే ఆలయం ధ్వంసానికి కారణమైందని పేర్కొన్నారు. ఆలయం ధ్వంసానికి పాల్పడిన ఆరుగురు నిందితులను ములకలచెరువులోని కదిరి రోడ్డులో అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఘటన జరిగిన రెండు రోజుల్లోనే మదనపల్లె డీఎస్పీ దర్బార్ కొండయ్యనాయుడు, ములకలచెరువు సీఐ రాజ రమేష్, ఎస్సై గాయత్రిలు నిందితుల కోసం గాలించి కేసు ఛేదించారని వివరించారు. ఇనుప సామగ్రిని స్వాధీనం చేసుకుని పట్టుబడిన వారిని కోర్టుకు హాజరు పరిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ, సీఐ, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : పట్టణంలోని ఈస్ట్ పేటలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. రోడ్డు పక్కన మృతదేహం ఉండటంతో స్థానికులు గుర్తించి మదనపల్లె ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ చాంద్‌బాషా, ఎస్ఐ అన్సర్‌బాషా, ఏఎస్ఐ సర్దార్ హుస్సేన్‌లు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి శవాగారానికి తరలించారు. మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే ఆసుపత్రికి వచ్చి మృతదేహాన్ని తీసుకెళ్లాలని సీఐ కోరారు.



అనుమానాస్పద మృతిపై కేసు నమోదు


వీరబల్లి, న్యూస్‌టుడే : ఎస్పీ ఆదేశాల మేరకు మండల పరిధిలో అనుమానాస్పద మృతిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. మండలంలోని సి.టి.కె హరిజనవాడకు చెందిన పోతే సుధాకర్ (52) ఈ నెల 6న తన అత్త ఇల్లు తొట్టికాడ హరిజనవాడకు జాతరకు వెళ్లారు. అక్కడ బంధువులు, గ్రామస్థులతో కలిసి మద్యం తాగారు. ఈ క్రమంలో మరుసటి రోజు సుధాకర్ ఆకస్మికంగా ఆ గ్రామంలోనే మృతి చెందారు. అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తెచ్చి పూడ్చిపెట్టారు. అనంతరం సుధాకర్ మృతిపై అనుమానాలు ఉన్నాయని అతని బంధువులు, గ్రామస్థులు వీరబల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. వారు మరుసటి రోజు రమ్మని చెప్పారు. అనంతరం వారు రాక పోవడంతో కేసు నమోదు చేయలేదు. ఈ నేపథ్యంలో రెండు రోజుల కిందట మృతుడు సుధాకర్ అక్క రాణి న్యాయం చేయాలని ఎస్పీని ఆశ్రయించారు. ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం రాయచోటి గ్రామీణ సీఐ వరప్రసాద్, పోలీసులు విచారించి బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. మృతుడు భార్య జీవనోపాధి నిమిత్తం కువైట్‌కు వెళ్లారు. వారికి పిల్లలు లేరు.

సీబీ నాట్ యంత్రానికి మరమ్మతులు

అందుబాటులోకి టీబీ పరీక్షలు

స్పందనకు వందనం


మదనపల్లె వైద్యం, న్యూస్‌టుడే : మదనపల్లె ప్రభుత్వ సర్వజన బోధన ఆసుపత్రిలో గత 8 నెలలుగా పనిచేయని సీబీనాట్ యంత్రానికి గురువారం మరమ్మతులు చేయించారు. యంత్రం పనిచేయకపోవడంతో నాణ్యమైన క్షయవ్యాధి పరీక్షలు చేయలేకపోయారు. ప్రస్తుతానికి ట్రూనాట్ యంత్రంలో పరీక్షలు చేస్తున్నారు. సీబీనాట్ యంత్రంతో అయితే ఖచ్చితమైన ఫలితాలు వస్తాయి. 8 నెలల క్రితం విద్యుత్తు సరఫరాలో వచ్చిన అంతరాయం కారణంగా ఈ యంత్రం కాలిపోయింది. అప్పటి నుంచి అలాగే ఉండిపోయింది. దీనిపై 'ఈనాడు'లో ఫిబ్రవరి 21వ తేదీన 'వైద్య పరీక్షలా... ప్రైవేటుకు వెళ్లాల్సిందే' జులై 22న 'రూ.40 లక్షల యంత్రం... రూ.20 వేలు లేక నిరుపయోగం' శీర్షికలతో కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై స్పందించిన ఆసుపత్రి సూపరింటెండెంట్ అప్పట్లోనే కలెక్టర్‌కు, డీఎంఈ అధికారులకు నివేదిక పంపారు. అలాగే అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ శైలజ కూడా దీనిపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించడంతో రూ.60 వేలతో కొత్తగా సీపీయూ కొనుగోలు చేసి సీబీ నాట్ యంత్రాన్ని వినియోగంలోకి తీసుకొచ్చారు. గురువారం నుంచి సీబీ నాట్ యంత్రం ద్వారా క్షయ పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో సమస్య పరిష్కారమైంది.



వినియోగంలోకి వచ్చిన యంత్రం

కుట్రదారులను కఠినంగా శిక్షించాలి

ములకలచెరువు, న్యూస్‌టుడే : ములకలచెరువు సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయం కూల్చివేతకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని టీఎస్ఎన్‌వీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టా దొరస్వామి నాయుడు, తెదేపా మండల కన్వీనర్ పాలగిరి సిద్ద అన్నారు. 16వ శతాబ్దం నాటి కనుగొండరాయస్వామి ఆలయాన్ని కూల్చడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. 2012లో అభయాంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించగా కుట్రపూరితంగా నేలకూలింది. గురువారం నేలకూలిన ఆలయాన్ని నాయకులు పరిశీలించారు. ఆలయాన్ని కూల్చింది గుప్తనిధుల కోసమా? పూజారుల మధ్య వివాదమా..? ఇతర ఉద్దేశ పూర్వక కారణాలతో ఆలయాన్ని కూల్చారా? అన్న కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టాలని తెలిపారు. ఆలయం కూల్చిన వారిని చట్టపరంగా శిక్షించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు గిరిధర్, కేశవులు, చెన్నకృష్ణ, సోముశేఖర్, శివన్న, వెంకటస్వామి, రమణ, గొడ్డుమూరు రవి తదితరులు పాల్గొన్నారు.



ఆలయాన్ని పరిశీలిస్తున్న కట్టా దొరస్వామినాయుడు, సిద్ద, నాయకులు

రాష్ట్రస్థాయి పురస్కారానికి ఉపాధ్యాయుడి ఎంపిక



రాఘవేంద్రబాబు

రామసముద్రం, న్యూస్‌టుడే: తెలుగు సాహిత్య రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు రామసముద్రం మండలం జంగాలపల్లె ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాఘవేంద్రబాబు ఎంపికయ్యాడు. అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య వారి ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన విజయవాడలో జరుగు కార్యక్రమంలో అవార్డు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఉత్తమ అవార్డుకు ఎంపికైన ప్రధానోపాధ్యాయుడికి మండల ఎస్టీయూ సంఘ నాయకులు అభినందనలు తెలియజేశారు.

విద్యుత్తుశాఖ ఏడీగా గోవిందురెడ్డి

ములకలచెరువు : ములకలచెరువు విద్యుత్తుశాఖ ఏడీగా గోవిందురెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మదనపల్లెలో ఏఈగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ములకలచెరువు ఏడీగా వచ్చారు. ములకలచెరువులో పనిచేస్తున్న రూక్మనందబాబు ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా గోవిందురెడ్డి మాట్లాడుతూ... మండలంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ విద్యుత్తు సమస్యలు తలెత్తకుండా చూస్తామన్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే పరిష్కరిస్తామన్నారు.




ఉరేసుకుని డ్రైవరు ఆత్మహత్య

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : కుటుంబ కలహాలతో డ్రైవర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మదనపల్లె పట్టణంలో గురువారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. నీరుగట్టువారిపల్లెలోని రామిరెడ్డి లేఅవుట్‌కు చెందిన రిజ్వాన్‌బాషా (35) డ్రైవరుగా పనిచేస్తాడు. ఇతనికి 2011 తస్రీన్‌బానుతో వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు, ఇద్దరు మగ పిల్లలున్నారు. మూడు రోజుల క్రితం భార్యాభర్తలు గొడవపడ్డారు. దీంతో ఆమె అలిగి పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన రిజ్వాన్‌బాషా బుధవారం రాత్రి ఇంట్లోనే చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం మధ్యాహ్నం ఇంటికి వచ్చిన భార్య లోపల నుంచి గడియ పెట్టి ఉండటంతో భర్తకోసం పిలిచింది. ఆయన తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చి స్థానికులతో తలుపు పగులగొట్టి చూడగా భర్త ఉరి వేసుకుని ఉండటాన్ని గుర్తించి కేకలేసింది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఒకటో పట్టణ సీఐ చాంద్‌బాషా ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఆసుపత్రి మార్చురికి తరలించారు. అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు.

మత్స్యకారుడిని కాపాడిన పోలీసులు

పెంట్లవెల్లి, న్యూస్‌టుడే : ఆత్మహత్య చేసుకుంటున్నానని 100కి ఫోన్‌చేసిన వ్యక్తిని పోలీసులు కాపాడారు. ఎస్సై రామన్‌గౌడ్ కథనం ప్రకారం... పెంట్లవెల్లి మండలం కృష్ణానదీ తీరంలో చేపలు పట్టడానికి రెండు నెలల ఒప్పందం మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గుత్తేదారుడు అన్నమయ్య జిల్లాకు చెందిన షేక్ షానావాజ్‌ను తీసుకువచ్చారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు షేక్‌షానావాజ్ నదీ తీరంలో తీవ్ర భయాందోళనకు గురయ్యారు. దీంతో పోలీసులకు ఫోను చేసి ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గుత్తేదారుడి నుంచి కొంత నగదును ఇప్పించి బస్సు ఎక్కించారు.

తీరు మారలేదు... చిత్రాలు తొలగలేదు



శుద్ధజల కేంద్రం శిలాఫలకంపై తొలగని మాజీల పేర్లు

కలికిరి మండలం గుట్టపాలెంకస్సా సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన శుద్ధజల కేంద్రం శిలా ఫలకంపై వైకాపా మాజీ సీఎం జగన్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చిత్రాలను తొలగించకుండా అలాగే వదిలేశారు. ఈ చిత్రాలు చూసిన స్థానికులు, అధికారులు స్పందించి చిత్రాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. - న్యూస్‌టుడే, కలికిరి

మదనపల్లె

•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

అన్నదాత ఆశలు ఆవిరి

పీలేరు గ్రామీణ: పీలేరు మండల పరిధిలో వర్షాలకు వరి పంట నేలకొరిగింది. కోతకొచ్చిన పంట నేలకొరగడంతో పంట నూర్పిడికి కూలీలు దొరక్క, యంత్రాలతో కుదరక రైతులు తలలు పట్టుకుంటున్నారు. చేతికందిన పంటను నూర్పిడి చేసుకునే సమయానికి వర్షాలు కురవడంతో నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు. గురువారం పీలేరు మండల వ్యవసాయ అధికారులు పంట పొలాల బాటపట్టారు. పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికను జిల్లాస్థాయి అధికారులకు పంపుతామని ఏవో రమాదేవి తెలిపారు.



తలపులలో నీట మునిగిన పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఆలయాలతో గ్రామాల్లో ఐక్యత

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: కొత్తగా ఆలయాలు నిర్మించడం, చెక్కభజనలు, కోలాటాల ద్వారా గ్రామాల్లో కళలు, సంస్కృతి వీటి ఐకమత్యం ఏర్పడుతుందని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. గురువారం మండలంలోని నిమ్మనపల్లె పంచాయతీ నాగులయ్యగారిపల్లెలో నల్లగంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా నూతన ఆలయాన్ని సందర్శించారు. గ్రామ సమీపం నుంచి ఆలయం వరకు సిమెంటు రహదారి, గ్రామంలో మురుగు కాలువలు కావాలని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించారు. సర్పంచులు పాపులమ్మ, రెడ్డెప్ప, తెదేపా నాయకులు రాజన్న, ఆర్జే వెంకటేష్, మల్లప్ప, రెడ్డెప్పరెడ్డి, జయన్న, శ్రీపతి, శ్రీరాములు, రమణ, కృష్ణయ్య, ఖాసీం, షఫి, మహ్మద్‌రఫి, మల్లికార్జున, టెలిఫోన్ రెడ్డెప్ప, మహేష్, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు తక్షణం పరిష్కరించాలి

రామసముద్రం: మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని తహసీల్దార్ నిర్మలాదేవిని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశించారు. చిట్టెంవారిపల్లె రోడ్డు, ఆజ్మావారిపల్లెలో భూమి రిజిస్ట్రేషన్లకు ఉన్న సమస్యలను బాధితులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. స్పందించిన ఆయన తహసీల్దారుతో చర్చించారు. సమస్యల పరిష్కారానికి మండలంలో తహసీల్దార్, ఎస్.ఐ., ఎంపీడీవోతో కూడిన త్రిసభ్య కమిటీని నియామకం చేయాలని కోరారు. వివాదాలు చోటుచేసుకోకుండా సామరస్య పూర్వక వాతావరణంలో భూసమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఈస్ట్ సెక్షన్ ఏఈగా కుమార్‌బాబు

మదనపల్లె విద్యు: మదనపల్లె విద్యుత్‌శాఖ ఈస్ట్ సెక్షన్ ఏఈగా కె. కుమార్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ పనిచేస్తున్న రెడ్డికుమార్ ఉద్యోగోన్నతిపై రాయచోటికి వెళ్లడంతో ఆయన స్థానంలో కుమార్‌బాబును నియమించారు. డివిజన్‌లో అందుబాటులో ఉంటూ విద్యుత్తు సమస్యలపై సత్వరం స్పందిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను ఏడీఈలు హరికుమార్, రెడ్డికుమార్, ఏఈలు అజయ్‌బాబు, ఎల్‌వీలు నాగరాజు, బాలకృష్ణ, ఎల్‌ఐలు శేషాద్రి నాగరాజు, లక్ష్మీనారాయణ, రామచంద్రనాయక్, సిబ్బంది అభినందించారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కలికిరి: నట్టల నివారణ కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వెంకట మునినాయుడు కోరారు. గురువారం కలికిరి మండలం మద్ది కుంటపల్లెలో నట్టల నివారణ కార్యక్రమాన్ని సర్పంచి రెడ్డిరామం ప్రారంభించారు. ఈ నెల 19వ తేదీ వరకు అన్ని గొర్రెలు, మేకలకు ఉచితంగా ప్రభుత్వం తరఫున నట్టల నివారణ మందులు తాపించడం జరుగుతుందన్నారు. రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇలియాజ్ జేవీవో, అనిల్, పవన్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవుల మృతి

మదనపల్లె నేరవార్తలు: జనినికొండకు చెందిన రమణయ్య ఆవులను మేతకు తీసుకెళ్లాడు. ఇంటికి తోలుకొస్తుండగా శ్రీకృష్ణదేవరాయ కూడలిలో వెల్డింగ్ దుకాణంలోకి వెళ్లాయి. మరమ్మతులు చేస్తుండగా అదేను విద్యుత్తు తీగలను తొక్కడంతో ఒక్కసారిగా షాక్‌కు గురై ఆవులు మృత్యువాతపడ్డాయి. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన అభ్యర్థించారు.

ప్రభుత్వ పథకాలు రాకుంటే ఫీజులేలా కట్టాలి

మదనపల్లె విద్య: రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు అస్తిమిన్న పథకాలకు సంబంధించిన నిధులు విడుదల చేయకపోతే విద్యార్థులు ఏ విధంగా ఫీజులు కట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవ్‌కుమార్ అన్నారు. గురువారం బీటీ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు... ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో డిగ్రీ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వెంటనే విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేయాల్సి ఉంటాయని ఆయన తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కో-కన్వీనర్ గంగారాణి, మదనపల్లె నియోజకవర్గ అధ్యక్షుడు కమలాకర్, వినయ్‌కుమార్, వెన్నెల, శ్రావణి, తేజేశ్వరి, మంజుల, పురుషోత్తం పాల్గొన్నారు.

లింకిశెట్టి చెరువు... ఆక్రమణల దరువు

- మట్టిదిబ్బలతో పూడుస్తున్నా పట్టని అధికారులు
- జల వనరులుగా ఉన్న కొండ వంకలూ అన్యాక్రాంతం



లింకిశెట్టి చెరువులో వేసిన మట్టి దిబ్బలు

జల వనరులుగా ఉన్న చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయి. వర్షాధారంగా ఉన్న ఈ చెరువులకు వంకలు, కాలువల నుంచి నీరు చేరుతుంది. ఇలాంటి వంకలు అన్యాక్రాంతమయ్యాయి. దీనిపై పర్యవేక్షించాల్సిన జలవనరులశాఖ అధికారులు నిద్రావస్థలో ఉన్నారు. చెరువులు, వంకలను కాపాడాల్సిన రెవెన్యూ, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆక్రమణలకు గురవుతున్నాయి. వీటిలో మదనపల్లె గ్రామీణ మండలం లింకిశెట్టి చెరువులో మట్టిదిబ్బలు వేస్తుండటంతో పాటు, దీనికి అనుసంధానంగా ఉన్న కొండవంక ఆక్రమించేశారు.

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని తట్టివారిపల్లె పంచాయతీ పరిధిలో తిరుపతి రహదారిపై లింకిశెట్టిచెరువు దాదాపు 45 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. మదనపల్లె పట్టణ సరిహద్దు ప్రాంతంలో ఉండటంతో ఇక్కడ ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలకు విలువ పెరిగింది. దీంతో చెరువు వెనుక భాగంలో కొందరు అక్రమంగా ఇటుక బట్టీలు వేస్తుండటంతో పాటు, కొందరు అక్రమంగా చెరువు కట్టపై మట్టివేసి రాత్రివేళల్లో చదును చేస్తున్నారు. ఇలా క్రమేణ ఆక్రమణయత్నాలు సాగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. ● మదనపల్లె-తిరుపతి మార్గంలోని సీటీయం రోడ్డులో చీకలగుట్ట నుంచి వర్షపునీరు ఈ చెరువుకు వెళ్లే వంక ఉంది. ఇది రెవెన్యూ దస్త్రాల ప్రకారం దాదాపు 30 అడుగుల నుంచి 40 అడుగుల వెడల్పు, మూడు కిలోమీటర్ల పొడవు ఉండేది. ప్రస్తుతం ఈ వంక ఆక్రమణకు గురైంది. కొన్ని ప్రాంతాల్లో కనీసం అయిదు అడుగుల వెడల్పు కూడా లేదు. తాత్కాలిక మురుగు కాలువగా మారిపోయింది. వర్షపు నీరు చెరువుకు చేరే పరిస్థితి లేదు. దీంతో వర్షాలు కురిస్తే వంక నీరు రహదారిపై ప్రవహిస్తుండటంతో తారులేచి కంకర తేలింది. స్థానికులు పలుమార్లు మండల అధికారులకు, జలవనరులశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదు. ● సబ్ కలెక్టర్ కార్యాలయంలో కూడా వంక స్థలం ఆక్రమించుకున్నారని ఆరోపిస్తూ గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఇప్పటికీ అధికారులు చర్యలు తీసుకోలేదని ఆరోపణలు వస్తున్నాయి. జల వనరులను కాపాడుకోకపోతే భవిష్యత్తులో సాగునీరే కాకుండా తాగునీటికి కూడా కష్టాలు తప్పవని వాపోతున్నారు.



అయిదడుగులకు కుచించుకుపోయిన కొండ వంక

సర్వే చేయించి చర్యలు తీసుకుంటాం



లింకిశెట్టి చెరువు, కొండ వంకలను సర్వే చేయించి ఆక్రమణలకు గురైనట్లు తేలితే తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. మండల, గ్రామ సర్వేయర్లతో గ్రామ దస్త్రాలను పరిశీలించి పూర్తిస్థాయిలో చెరువు, వంకను సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసి కబ్జా జరిగి ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. నిర్మాణాలపై పంచాయతీ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాల్సి ఉంది. చెరువుల్లో మట్టి వేయకుండా, చదును చేయకుండా పర్యవేక్షించాలని జలవనరులశాఖ అధికారులకు సూచిస్తాం. - ఖాజాబీ, తహసీల్దార్, మదనపల్లె

మేమున్నాం... మీకు తోడుగా...

(10 AM to 1 PM)
మదనపల్లె : 8008574611
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 8008574612

- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

?: గ్రామీణ మండలం పొన్నూటిపాళ్యం పంచాయతీ చిప్పిలి సమీపంలోని బెంగళూరురోడ్డులో కల్వర్టు చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలతో కనిపించడం లేదు. రాత్రి వేళల్లో ఏ ప్రమాదం సంభవిస్తుందని భయాందోళనగా ఉంది? - చలపతి, చిప్పిలి, మదనపల్లె

✔: మొక్కలను తొలగించి కల్వర్టు కనిపించే విధంగా, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.
- బూరయ్య, ఏఈఈ, రోడ్లు, భవనాలశాఖ, మదనపల్లె

?: మదనపల్లెలోని ఆంజనేయగుడి వీధిలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళల్లో మహిళలు, పిల్లలు భయాందోళనతో వెళ్లాల్సి వస్తుంది. కుక్కలబెడద ఎక్కువగా ఉంది? - మోహన్, మదనపల్లె

✔: వీధి దీపాలు మరమ్మతు చేయించి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. - శ్రావణి, డీఈఈ, పురపాలక సంఘం, మదనపల్లె

?: నీరుగట్టువారిపల్లెలోని కట్లాటపల్లె రోడ్డులో చెత్తచెదారం గుట్టగా పేరుకుపోయింది. వాహనాల రాకపోకలతో రోడ్డుపైకి వస్తుంది. దుర్వాసన, దోమల నిలయంగా మారింది?
- అరవింద్, నీరుగట్టువారిపల్లె

✔: పారిశుద్ధ్య పనులు చేపట్టి, చెత్తచెదారాన్ని సంపద కేంద్రానికి తరలించి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం.
- స్నేహప్రియ, ఏఈఈ, పురపాలక సంఘం, మదనపల్లె

?: మండలంలోని పొన్నూటిపాళ్యం పంచాయతీ చిప్పిలి గ్రామంలో చెత్తదిబ్బలు పేరుకుపోయాయి. సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు వెళ్లే మార్గంలో ఇళ్ల మధ్యలో దుర్వాసన వస్తోంది?
- వెంకటేష్, బెంగళూరు రోడ్డు, మదనపల్లె

✔: పంచాయతీ కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేపట్టి శుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటాం.
- మస్తాన్‌వల్లి, ఎంపీడీవో, మదనపల్లె, - న్యూస్‌టుడే, పీలేరు

?: పీలేరు పంచాయతీ చిన్నగాంధీ వీధిలో ఉన్న చేతిపంపు మరమ్మతులకు గురై వారం రోజులవుతున్నా ఇప్పటి వరకు మరమ్మతులు చేయలేదు. చుట్టుపక్కల ప్రజలు నీటికి ఇబ్బంది పడుతున్నారు? - జవహర్‌బాషా, స్థానికుడు

✔: సంబంధిత మెకానిక్‌కు చెప్పి సత్వరం మరమ్మతులు చేయిస్తాం. - శివకుమార్, ఎంపీడీవో, పీలేరు, - న్యూస్‌టుడే, నిమ్మనపల్లె

?: నిమ్మనపల్లె ప్రాథమిక పాఠశాల ఆవరణలోని చెట్లకొమ్మలు విద్యుత్తు తీగలపై పడుతున్నాయి. చెట్టు మొదలు పాఠశాల ఆవరణలో ఉంది. పొరబాటున విద్యుత్తు ప్రవహిస్తే ప్రమాదం జరిగే పరిస్థితి ఉంది? - బాషా, నిమ్మనపల్లె

✔: కొమ్మలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.
- పద్మావతి, ఎంఈవో-I, నిమ్మనపల్లె, - న్యూస్‌టుడే, పీటీఎం

?: పీటీఎం బ్యాంకుకు వెళ్లే దారిలో చెత్త పేరుకుపోయింది. దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు? - బాషా, స్థానికుడు

✔: రెండు రోజుల్లో చెత్తకుప్పలు తొలగించి దుర్వాసన వెదజల్లకుండా బ్లీచింగ్ పౌడర్ వేయిస్తాం.
- మహబూబ్‌బాషా, పంచాయతీ కార్యదర్శి

స్ఫూర్తిప్రదాత వాల్మీకి మహర్షి



నివాళులర్పిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



బి.కొత్తకోట నగర పంచాయతీ కార్యాలయంలో...



పీలేరులో అంజలి ఘటిస్తున్న ఎంఈవోలు

ప్రపంచమే గౌరవించే రామాయణం లాంటి ఆదర్శ గ్రంథాన్ని రచించిన ఆది కవి వాల్మీకి అని నాయకులు కొనియాడారు. గురువారం వాల్మీకి జయంతిని పురస్కరించుకుని అధికారులు, కూటమి నాయకులు, వాల్మీకి సంఘం ప్రతినిధులు పట్టణాలు మొదలుకుని పల్లెల వరకు వాడవాడలా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. వాల్మీకి విగ్రహాలు, చిత్రటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో ర్యాలీలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వాల్మీకి జన్మించడం భారతీయులు చేసుకున్న పుణ్య ఫలమని ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా నియోజకవర్గవ్యాప్తంగా పలుచోట్ల జయంతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల చిత్రాలివి.
- న్యూస్‌టుడే, మదనపల్లె క్లస్టర్ బృందం



నీరుగట్టువారిపల్లె మార్కెట్ యార్డు వద్ద వాల్మీకి చిత్రపటానికి పూలు వేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సంఘం నాయకులు



చిత్తూరు బస్టాండు కూడలిలో పూజలు చేస్తున్న భాజపా సీనియర్ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, నాయకులు

ద్రోన్లతో లోతట్టు ప్రాంతాల్లో సర్వే



అంబేడ్కర్ కూడలిలో భూగర్భ మురుగు కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రమీల

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : నాలుగు రోజులుగా తుపాను ప్రభావం వల్ల ముసురు వర్షాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మదనపల్లె పురపాలక సంఘంలో డ్రోన్ల సాయంతో సర్వే నిర్వహించారు. కమిషనర్ ప్రమీల పర్యవేక్షణలో డ్రోన్లను వినియోగించి పరిస్థితిని చిత్రీకరించారు. ప్రత్యేకించి పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను డ్రోన్ల సాయంతో చిత్రీకరించి తాజా పరిస్థితిని అంచనా వేశారు. మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ డ్రోన్ల ద్వారా చిత్రీకరించిన చిత్రాలను తెప్పించుకుని పరిస్థితిని సమీక్షించారు. బాహుదా నది పరివాహక ప్రాంతాల్లోని రామ్‌నగర్, జీఎంనగర్, ఆంజినేయస్వామి గుడి పరిసర ప్రాంతాల్లో డ్రోన్‌ను వినియోగించి చిత్రీకరించారు. కమిషనర్ ప్రమీల గురువారం లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని అంచనా వేశారు. అక్కడ నివాసముంటున్న ప్రజలకు పలు సూచనలు ఇచ్చారు. ప్రధాన కూడళ్లలో వర్షం నీరు నిల్వ ఉండకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలిచ్చారు.

ప్రతి గ్రామం... అభివృద్ధి పథం

కూటమి ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో పయనిస్తుందని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, తంబళ్లపల్లె నియోజకవర్గ తెదేపా నేత జయచంద్రారెడ్డి అన్నారు. గురువారం మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తల నడుమ అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో సిమెంటు రహదారుల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. తెదేపా మండల పార్టీ అధ్యక్షులు, వివిధ విభాగాల బాధ్యులు, అధికారులు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల చిత్రాలివి. - న్యూస్‌టుడే, మదనపల్లె క్లస్టర్ బృందం



వాల్మీకిపురంలో భూమిపూజ చేసి రోడ్డు పనులకు శ్రీకారం చుడుతున్న తెదేపా నాయకులు తదితరులు



కలకడ : కదిరాయచెర్వులో సీసీరోడ్డుకు భూమి పూజ చేస్తున్న అధికారులు, నాయకులు



కురబలకోట మండలం ముదివేడులో భూమి పూజ కార్యక్రమంలో తెదేపా నేత జయచంద్రారెడ్డి, నాయకులు



కేవీపల్లె మండలం తిమ్మాపురంలో సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న మండల తెదేపా అధ్యక్షురాలు గీతాంజలి, నాయకులు

ఓటర్ల సమాచారం కంప్యూటరీకరణ

బి.కొత్తకోట: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యులుగా ఉన్న ఓటర్ల సమాచారాన్ని కంప్యూటరీకరించే ప్రక్రియను ప్రారంభించినట్లు సీఈవో ఆదినారాయణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ... సహకార సంఘంలో ఓటర్లుగా ఇప్పటికే నమోదు చేయించుకున్న రైతులు తమ ఆధార్‌కార్డు, పాసు పుస్తకాల జిరాక్సులతో తమ కార్యాలయానికి రావాలని సూచించారు. తాము అందజేసే ప్రొఫార్మాలో సంతకాలు చేసి ఇస్తే వాటిని తాము స్కాన్ చేసి సహకారశాఖకు పంపుతామని, తద్వారా కంప్యూటరీకరణ పూర్తవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించాలని కోరారు.

పారిశుద్ధ్యం మెరుగుపై దృష్టి పెట్టండి

మదనపల్లె విద్య : వర్షాల కారణంగా గ్రామాల్లో చెత్త పేరుకుపోకుండా పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని డీఎల్‌పీవో నాగరాజు తెలిపారు. గురువారం ఆయన అంకిశెట్టిపల్లె పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా రామాపురంలోని నీటి ట్యాంకుకు క్లోరినేషన్, గ్రామాల్లో చేపట్టిన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: సమయపాలన పాటించని ఉద్యోగులపై చర్యలు తప్పవని డీఎల్‌డీవో అమరనాథరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కొండయ్యగారిపల్లె గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎల్‌డీవో మాట్లాడుతూ... కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను పరిష్కరించి ప్రజలతో మమేకం కావాలన్నారు. ఇబ్బంది కర ప్రజా సమస్యలుంటే వెంటనే ఉన్నతాధికారులకు తెలిపి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పరమేశ్వ రెడ్డి, ఏవో రమేశ్‌బాబు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్నా... పట్టించుకోరా?



పెచ్చులూడిన తహసీల్దార్ కార్యాలయం

తంబళ్లపల్లె తహసీల్దార్ కార్యాలయం వర్షానికి పెచ్చులూడింది. దీంతో కార్యాలయాన్ని మండల పరిషత్ విశ్రాంతి భవనంలోకి మార్పు చేస్తున్నట్లు తహసీల్దార్ హరికుమార్ తెలిపారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కార్యాలయంలోని గదులన్నీ తడిసిపోయాయి. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ అయ్యిందని, దీంతో సిబ్బందికి, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కలెక్టర్, సబ్‌కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయాన్ని తాత్కాలికంగా మండల కేంద్రానికి సమీపంలోని ద్వారకనగర్‌లో ఉన్న జిల్లా పరిషత్ విశ్రాంతి భవనంలోకి మారుస్తున్నట్లు తెలిపారు. - న్యూస్‌టుడే, ములకలచెరువు

గత సర్కారు నిర్లక్ష్యం... ఉర్దూ బడులకు శాపం

- అంచనాలో సగమే చెల్లింపులు
- ముందుకు సాగని ప్రగతి పనులు

పీలేరు, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ నిర్వాకం వల్ల పీలేరు ఉర్దూ ఉన్నత పాఠశాల భవనాలు పూర్తి కావడం లేదు. ప్రస్తుతం పాత భవనాల్లో నడుస్తున్న ఉర్దూ పాఠశాలలో 250 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉన్న భవనాలు చాలవని కొత్త భవనాలు నిర్మించేందుకు 2018లో రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్ (ఆర్ఎంఎస్ఏ) కిందట రూ.53 లక్షల అంచనాతో పనులు మంజూరయ్యాయి. ఈ నిధులతో అయిదు తరగతి గదులు నిర్మించేందుకు పాఠశాల అభివృద్ధి కమిటీకి పనులు కేటాయించారు. భవనాలకు తొలివిడతగా రూ.26.50 లక్షలు విడుదల చేశారు. నిధులు మళ్లీ కేటాయిస్తారన్న భరోసాతో కమిటీ రూ.45 లక్షలు విలువైన పనులు పూర్తి చేశారు. వైకాపా ప్రభుత్వంలో జిల్లాల విభజన తరువాత ఆర్ఎంఎస్ఏ పనులు జరిగినంత వరకు ఎంబుక్‌లు రాసి జిల్లా ఇంజినీరింగ్ అధికారులకు బదిలీ చేశారు. చిత్తూరు జిల్లా నుంచి అన్నమయ్య జిల్లాకు బదిలీ చేసిన తరువాత పనులకు సంబంధించి నిధులు విడుదల చేయకపోవడంతో ఉర్దూ పాఠశాల పనులు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. బిల్లులు మంజూరు చేస్తే మిగిలిన పనులు పూర్తి చేస్తామని పాఠశాల కమిటీ సిద్ధంగా ఉన్నా నిధుల ఊసేలేదు. పనులు చేసిన కమిటీ వారు చిత్తూరు ఇంజినీరింగ్ అధికారులను కలిస్తే మీరు పనులు చేసినంత వరకు ఎంబుక్‌లు రాసి జిల్లాకు పంపమని చెప్పడంతో కమిటీ అన్నమయ్య ఇంజినీరింగ్ అధికారుల వద్దకు వెళ్లి బిల్లుల విషయం ప్రస్తావించారు. 'పనులు చిత్తూరు జిల్లాలో చేసినందున చేసినంత వరకు బిల్లులు అక్కడ తీసుకోవాలి' అని చెప్పడంతో కమిటీ వారు నిర్ఘాంతపోయారు. ఇప్పుడు పనులు పర్యవేక్షించేందుకు అన్నమయ్య అధికారులు వస్తున్నా పాత పనుల మాట మాత్రం ఎత్తడం లేదు. దీంతో ఆ పనులు చేసిన కమిటీ రూ.18 లక్షల వరకు బిల్లులు పెండింగ్ ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు. దీంతో పాటు గత ఏడాదిగా పెండింగ్ పనులు కూడా పూర్తి చేసేందుకు కమిటీ ఆసక్తి చూపడంలేదు. పాత ఉర్దూ పాఠశాల భవనాల్లోనే విద్యార్థులు చాలీచాలని గదులతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ మాట్లాడుతూ... నిధులు వస్తే పనులు చేసిన వారికి బిల్లులు చెల్లిస్తామని చెబుతున్నారని ఇంజినీరింగ్ అధికారులకు కూడా ఈ విషయాన్ని తెలియజేశామన్నారు. 2019 మార్చి 30వతేదీ తరువాత కమిటీకి ఒక్క పైసా కూడా బిల్లు చెల్లించనందున పనులు తీసుకున్నా అప్పులు చెల్లించలేక కమిటీ వారు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.



పీలేరులో పూర్తి కాని ఉర్దూ ఉన్నత పాఠశాల తరగతి గదులు

ఎక్కడి బిల్లులు అక్కడే గప్‌చుప్

కంభంవారిపల్లె : మండలం వగళ్ల ఉన్నత పాఠశాలకు రూ.29.42 లక్షలతో అంచనాలు వేసినా వచ్చిన రూ.14.71 లక్షల వరకు పనులు చేశారు. కలకడ కస్తూర్బా పాఠశాలకు రూ.22.09 లక్షలకు అంచనాలు వేసినా వచ్చిన రూ.11.06 లక్షలకు పనులు చేశారు. పీలేరు కోటపల్లె బాలుర ఉన్నత పాఠశాలకు రూ.55 లక్షలకు అంచనాలు వేసినా వచ్చిన రూ.25 లక్షలకు పనులు చేశారు. ఎటొచ్చీ పీలేరు ఉర్దూ ఉన్నత పాఠశాలకు మాత్రమే జరిగినంత పనులు జరిగినంత వరకు బిల్లులు రావాల్సి ఉంది. అధికారులు చర్యలు తీసుకుని బిల్లులు చెల్లించాలని ఉర్దూ పాఠశాల కమిటీ వారు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు

ఉర్దూ పాఠశాల పనులన్నీ చిత్తూరు జిల్లా పరిధిలో ఉన్నప్పుడు జరిగాయి. అందువల్ల బిల్లులు ఆ జిల్లా అధికారులు ఉన్నతాధికారులకు మంజూరుకు పంపాల్సి ఉంది. పనులు అన్నమయ్య జిల్లాకు బదిలీ చేసిన తరువాత నిధులు రాలేదు. పనులు చేసినంత వరకు బిల్లులు చెల్లింపు విషయంలో ఉన్నతాధికారులకు విషయం తెలియజేస్తాం. వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటాం. - మురళీధర్, ఏఈ, రాయచోటి


మొక్కులు తీర్చుకుంటున్న గ్రామస్థులు

వడ్డిపల్లెలో గంగమ్మ జాతర

పుల్లంపేట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని రంగంపల్లె పంచాయతీలోని వడ్డిపల్లె గురువారం గంగమ్మ జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు గ్రామస్థులు తెలిపారు. తొలుత అమ్మ వారికి పొంగళ్లు నిర్వహించి ప్రసాదాలను సమర్పించారు. అనంతరం అమ్మ వారికి మొక్కులు తీర్చుకున్నారు.

రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

కళాశాలల దారిలో మద్యం దుకాణాలు తొలగించండి

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: స్టేట్ బ్యాంకు ఎదురుగా ఉన్న ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేశారని, తొలగించాలని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి ఆధ్వర్యంలో గురువారం ఎక్సైజ్ సీఐ తులసికి వినతిపత్రం అందజేశారు. ఆ ప్రాంతంలో రెండు ప్రైవేటు జూనియర్ కళాశాలలు, ఓ పాఠశాల, ఆర్ఎస్ రోడ్డులో మరో దుకాణం ఏర్పాటు చేశారన్నారు. ఈ పరిస్థితులను పర్యవేక్షించి అక్కడి నుంచి దుకాణాలను మారుస్తామని సీఐ వారికి హామీ ఇచ్చారు.


ఎక్సైజ్ సీఐ తులసికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

పూర్తిస్థాయిలో నీరు నిల్వ చేస్తాం


జలాశయాన్ని పరిశీలిస్తున్న జలవనరులశాఖ ఈఈ, తదితరులు

సుండుపల్లి, న్యూస్‌టుడే: వై. ఆదినారాయణరెడ్డి పింఛ జలాశయంలో వచ్చే నీటిని పూర్తి స్థాయిలో నిల్వ ఉంచుతామని జలవనరులశాఖ ఈఈ వెంకట్రామయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం జలాశయాన్ని సందర్శించి జలాశయంలోకి వస్తున్న నీటిపై ఆరా తీశారు. జలాశయంలో పూర్తి స్థాయిలో నీటి నిల్వ ఉంచాలని సిబ్బందికి సూచించారు. జలాశయంలోకి గురువారం మధ్యాహ్నానికి 164 క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. జలాశయంలో 976.3 అడుగుల వద్ద నీటి మట్టం ఉందన్నారు. పది క్యూసెక్కుల నీరు విడుదల అవుతోందని తెలిపారు. దురికోన జలాశయాన్ని కూడా సందర్శించారు. ఆయనవెంట డీఈ చెంగల్రాయుడు, ఏఈ నాగేంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించండి


వైద్యులకు సూచనలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొండయ్య

నందలూరు, న్యూస్‌టుడే: నందలూరు మండల ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొండయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని పలు దస్త్రాలు, పరికరాలను పరిశీలించారు. అధిక వర్షాలతో రవాణా దూరంగా ఉన్న గ్రామాలను గుర్తించి వారికి గ్రామంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారులు శరత్‌కమల్, కార్తీక్ విశ్వనాథ్, సిహెచ్‌ఓ వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చిరుతపులి సంచారంపై వీడియో హల్‌చల్

లక్కిరెడ్డిపల్లె, రామాపురం: లక్కిరెడ్డిపల్లె, రామాపురం పరిధిలోని గ్రామాల్లో చిరుతపులి సంచరిస్తోందన్న వీడియో సామాజిక మాధ్యమాల్లో కలకలం రేపింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై అటవీ అధికారులు స్పందిస్తూ చిరుతపులి సంచరిస్తున్నట్లు స్పష్టమైన సమాచారం అందలేదన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

సుండుపల్లి, న్యూస్‌టుడే: మండలంలో గురువారం సాయంత్రం మెరుపులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. పింఛలో విద్యుత్తు నియంత్రిక సమీపంలో పిడుగు పడడంతో ముడుంపాడు కురవపల్లె విద్యుత్తు ఉపకేంద్రానికి సరఫరా అయ్యే లైనులో మెరుపులతో స్తంభాలకు ఉన్న డిస్కులు(పింగాణి) పగిలి విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్తు పునరుద్ధరణకు సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. పిడుగు కారణంగా ఛార్జింగ్‌లో ఉన్న చరవాణీలు కాలిపోయాయి. పింఛ జలాశయం వద్ద పనిలో ఉన్నవారు వేసుకొన్న తాత్కాలిక షెడ్డువద్ద వైరింగు కాలిపోవడంతో పాటు, గృహోపకరణాలు దగ్ధమయ్యాయి.

మండలాభివృద్ధిపై సమీక్ష


మాట్లాడుతున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు, న్యూస్‌టుడే: నందలూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో పలు అభివృద్ధి విషయాలపై అధికారులతో చర్చించారు. నందలూరు చెయ్యేరు నుంచి ప్రధాన పంట కాలువల ద్వారా కన్యకా చెరువుకు నీరు వెళ్లాల్సి ఉండగా కాలువలపై అక్రమ నిర్మాణాలతో చిన్న జడివాన కురిసినా నీరు రోడ్డుపై నిలవడంతో వాహనదారులు, పాదచారులకు ఇబ్బంది కల్గుతుందన్నారు. దీన్ని పరిశీలించి నీరు కాలువలలో ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుజాతమ్మ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ప్రభుత్వ భూముల కబ్జా!

విలువైన స్థలాలపై అక్రమార్కుల కన్ను

గాలివీడు, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన గాలివీడు వాణిజ్య కేంద్రం అభివృద్ధి చెందుతోంది. దీంతో ఇక్కడున్న భూములు, స్థలాలకు ఎగబడుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ భూములను స్థిరాస్తిలో కలిపేసుకుని లే అవుట్లకు రహదారులను వేసి ప్లాట్ల అమ్మకాలను సాగిస్తున్నారు. మరి కొందరు సర్కారు జాగాలను ఆక్రమించేందుకు యత్నిస్తున్నారు. మండల సమగ్ర కార్యాలయాల సమీపంలో వివిధ సర్వే సంఖ్యల్లో గుర్తించిన అయిదు ఎకరాల ప్రభుత్వ భూములపై పెద్దల కన్ను పడింది. కొందరు తమ వ్యవసాయ భూములను అభివృద్ధి చేసుకుని అందులోని రాళ్లను తీసి ప్రభుత్వ భూమిలో వదేస్తున్నారు. మరికొందరు లే అవుట్ ప్లాట్లకు అనువుగా ఆక్రమిస్తున్నారు. సెలవులు, పర్వదినాల్లో ఆక్రమణలు జరుగుతుండగా మండల రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఆక్రమణలపై కొంతమంది ఫిర్యాదులు చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని, కబ్జా ప్రాంతాలను స్వాధీనం చేసుకోవడానికి అధికారులు ముందుకు రావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● గాలివీడు-లక్కిరెడ్డిపల్లె మార్గంలో ఆవులశెట్టిగారిపల్లె శివారులో రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. ఇంటి నివాస పట్టాలు ఇవ్వాలని నిర్మాణాలకు మెటీరియల్ సరఫరా చేసుకున్న వారిని రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించారు. బలిజపల్లి వంక రూపురేఖలు మార్చివేశారు.

● మండల రెవెన్యూ కార్యాలయం నుంచి గోపనపల్లె రహదారి వరకు ప్రభుత్వ భూమిలో మట్టి రోడ్డు ఉంది. ఈ రహదారి వెంట ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు యత్నిస్తున్నారు. అక్రమ మార్గంలో కొందరు ఇప్పటికే డీకేటీ పట్టాలు పొందారు.


గాలివీడు-లక్కిరెడ్డిపల్లె రోడ్డులో ఆవులశెట్టిగారిపల్లె వద్ద ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం


గాలివీడులో ఆక్రమణలు అడ్డుకునేందుకు ఏర్పాటు చేసిన ఎర్రరాయి

● గాలివీడు-రాయచోటి ప్రధాన మార్గం, తహసీల్దారు కార్యాలయం సమీపంలో సర్వే నంబరు 900-ఏ1లో 85 సెంట్లు, 890లో 95 సెంట్లు, 900-బీలో 40 సెంట్లు, 900-బీలో 1.78 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. మరికొన్ని మిగులు భూములు వివాదాస్పదంగా మారాయి.

● గతంలో ప్రభుత్వ భూముల్లో ప్లాట్లు, నిర్మాణాలు, ఆక్రమణలు జరగకుండా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి కబ్జాదారుల ఆటలు సాగకుండా కట్టడి చేశారు. కొన్ని రోజులు రెవెన్యూ సిబ్బందిని కాపలా ఉంచారు. కొందరు సర్వే నంబరు 900-బీ1లో 86 సెంట్లు, 900-బీ8, బీలో 0.40 సెంట్లు, 1.78 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను తొలగించారు. ఎలాగైనా ప్రభుత్వ భూములను ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారు. మదనపల్లె మార్గంలోని నల్లగుట్టలో సర్వే నంబరు 1465-ఏ2లో 18.54 ఎకరాల ప్రభుత్వ భూమి అక్రమార్కులకు వనరుగా మారింది. వైకాపా పాలనలో జగనన్న కాలనీ కోసం స్థలం సేకరించారు. పక్కా గృహాల నిర్మాణాలను చేపట్టలేదు.

● గాలివీడు పరిసర ప్రాంతంలో ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ కార్యాలయాలకు, సామాజిక అవసరాలకు ప్రభుత్వ స్థలాలు వినియోగించాలని తెదేపా నాయకులు కోరుతున్నారు. అనర్హులకు ఇంటి పట్టాలు మంజూరు చేయకుండా ప్రభుత్వ స్థలాలను నిషేధిత జాబితాలో ఉంచాలన్నారు. ఇటీవల మండల ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దారు భాగ్యలతకు ప్రభుత్వ స్థలాలను కాపాడాలని అర్జీ సమర్పించారు.

నిఘా ఉంచాం

ఇటీవల బాధ్యతలు తీసుకున్నాం. ప్రభుత్వ భూముల్లో అనుమతి లేనిదే ఇతరులు ప్రవేశించడం నేరం. ఆక్రమణలు జరగకుండా నిఘా ఉంచాం. ప్రభుత్వ భూములను ప్రజా అవసరాలకు వినియోగిస్తాం. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. వాటిని తొలగిస్తే కేసులు తప్పవు.

- భాగ్యలత, తహసీల్దారు, గాలివీడు

నీటి నిల్వల తొలగింపు

స్పందనకు వందనం

వీరబల్లి మండలంలోని రాయచోటి-రాజంపేట రోడ్డు మార్గంలోని ఓదివీడు కుమ్మరపల్లి వద్ద రోడ్డులో నిల్వ ఉన్న నీటిని ఎట్టకేలకు అధికారులు తొలగింపు చర్యలు చేపట్టారు. ఇక్కడున్న సమస్యపై బుధవారం 'వాయుగుండం... ప్రజల్లో భయం' అన్న శీర్షికన ఓదివీడులో కుమ్మరపల్లి వద్ద నిల్వ ఉన్న నీటిపై వార్త ప్రచురితమైంది. స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు, సచివాలయ అధికారులు ప్రత్యేకంగా జేసీబీతో నీరు పోయేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే వాహనాలకు, చుట్టుపక్కల వారికి ఇబ్బందులు తొలగిపోయాయి. అధికారులతో పాటు తెదేపా పార్లమెంటు అధ్యక్షురాలు ఎం.సునీత పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, వీరబల్లి

In the Court of the Prl. Junior Civil Judge, Rayachoty
OS No. 24/2024

చెన్నంశెట్టి శోభరాణి, భర్త సుబ్బరామ, చెన్నంశెట్టిపల్లి, H/o పెద్ద బలిజపల్లి, టి.సుండుపల్లి, అన్నమయ్య జిల్లా. ... **వాది**

మరియు

ధర్మవరం రాఘవేంద్ర, తండ్రి ఆదినారాయణ, ఆనందనగర్, టి.సుండుపల్లి గ్రామం & మండలం, అన్నమయ్య జిల్లా. ... **ప్రతివాది D4**

నోటీసు

వాది, ప్రతివాది అయిన మీపై భాగ పరిష్కారం దావా పై కోర్టులో దాఖలు చేసి ఉన్నారు. పై కేసులోను మరియు I.A. No. 73/2024లోను మీరు **05.11.2024** తేదీ ఉదయం 10.30 గం॥లకు హాజరు అయి మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీకు పరోక్షంగా తీర్మానించబడును అని ఖచ్చితముగా తెలియచేయడమైనది.

కొట్టే రాజమనోహర్
న్యాయవాది, రాయచోటి.

గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం


సంజీవపురంలో సీసీరోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నాయకులు


హత్యరాల త్రేతేశ్వర ఆలయం వద్ద గ్రామస్థులతో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు


కంబాలకుంటలో పనులు ప్రారంభిస్తున్న సాయి వికాస్ రెడ్డి, నాయకులు

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే : మండలంలో పలు గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. రూ.60 లక్షలతో ముక్కావారిపల్లె, గొల్లపల్లె, గద్దలరేవుపల్లె, సంజీవపురం గ్రామాల్లో సిమెంట్ రోడ్ల పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు వికాస్‌రెడ్డి, ఎంపీడీవో మల్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చిట్వేలి(పుల్లంపేట) : చిట్వేలి మండలం నాగవరంలో గురువారం రూ.42 లక్షలతో సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ భూమి పూజ చేశారు. గ్రామీణ ప్రాంతంలో రహదారులను బాగు చేయాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

రాజంపేట గ్రామీణ : రాజంపేట మండలం అప్పారాజుపేట గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న హత్యరాల గ్రామాభివృద్ధికి కోసం రూ.1.52 కోట్ల నిధులతో పనులు ప్రారంభించామని తెదేపా జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు గురువారం తెలిపారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుబ్రహ్మణ్యం నాయుడు, నాయకులు బాలాజీ, ప్రభాకర్, రోహిత్ వెంటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ● రాజంపేట మండలంలోని హత్యరాల త్రేతేశ్వర స్వామిని తెదేపా జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తామని చెప్పారు.

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం ఎగువగడ్డ దళితవాడలో గురువారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు గ్రామ సర్పంచి నజీర్‌బాషా భూమి పూజ చేశారు.

లక్కిరెడ్డిపల్లె : గ్రామాభివృద్ధే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ధ్యేయమని తెదేపా మండల నాయకుడు యరమల మదన్‌మోహన్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని చౌటపల్లె పంచాయతీ కొత్తపల్లెలో అధికారులతో కలిసి సిమెంటురోడ్డుకు భూమి పూజ కార్యక్రమం చేశారు.

పెనగలూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వం మంజూరు చేసిన సీసీ రోడ్డు పనులను శరవేగంగా పూర్తి చేయాలని ఎంపీడీవో విజయారావు, తెదేపా నియోజకవర్గ యువ నాయకుడు ముక్కా సాయి వికాస్ రెడ్డి తెలిపారు. గురువారం కంబాలకుంటలో రూ.17 లక్షలతో సీసీ రోడ్డు పనులను టెంకాయలు కొట్టి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు.

సమస్యల పరిష్కారానికి వినతి

పెనగలూరు : పలు రకాల సమస్యలపై మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు పెరుగు కృష్ణయ్య నాయుడు తెలిపారు. నియోజకవర్గంలోని సమస్యలు, చేయాల్సిన అభివృద్ధి పనుల వివరాలు తెలిపినట్లు స్పష్టం చేశారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికీ తెలియజేయడం ఏమనగా మా కక్షిదారులు అయిన 1) బి.శారద, భర్త అన్నయ్య, 2) కె.లక్ష్మిదేవి, భర్త బాబు, 3) టి.శ్రీనివాసులు నాయుడు, తండ్రి చిన్నవెంకటేసు వారి సూచనల మేరకు,

ఈ క్రింది షెడ్యూలు దాఖలు ఆస్తి మా 1, 2 కక్షిదారుల తాత అయిన లేట్ బాలినేని రెడ్డెప్ప గారికి చెందినది. సదరు బాలినేని రెడ్డెప్ప గారి కుమారుడు అన్నయ్య మా కక్షిదారులకు రావలసిన వాటా ఇవ్వనందున మా కక్షిదారులు రాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు నందు OS No. 169/2024గా భాగపరిష్కారపు వ్యాజ్యము దాఖలు చేసియున్నారు. అయినప్పటికీ క్రింది షెడ్యూలు ఆస్తిని బాలినేని అన్నయ్య మా కక్షిదారుల ప్రమేయం లేకుండా ఇతరులకు అమ్ముటకు ప్రయత్నం చేయుచున్నాడని తెలిసినది.

క్రింది షెడ్యూలు దాఖలు ఆస్తిని మా కక్షిదారుల ప్రమేయం లేకుండా బాలినేని అన్నయ్య వద్ద ఎవ్వరైననూ కొన్ననూ అది చెల్లదని తెలియజేయడమైనది.

షెడ్యూలు : అన్నమయ్య జిల్లా, సంబేపల్లి మండలం మరియు నారాయణరెడ్డిపల్లె గ్రామ పొలంకు సంబంధించిన భూములు మరియు ఇండ్ల వివరాలు.

1) S.No. 254/12, L.P.No. 629 యం 0.25 సెంట్లు, 2) S.No. 254/9, L.P.No. 632 యం 0.64 సెంట్లు, 3) S.No. 252/3B, 252/3 B4 L.P. No. 629 యం 1.94 సెంట్లు, 4) S.No. 254/16, L.P No. 646 యం 1.68 సెంట్లు, 5) S.No. 254/18, L.P No. 648 యం 2.88 సెంట్లు, 6) S.No. 328/1, L.P No. 1792 యం 0.50 సెంట్లు, 7) S.No. 325/5, L.P No. 1801 యం 0.03 సెంట్లు, 8) S.No. 325/5, L.P No. 1802 యం 0.07 సెంట్లు, 9) S.No. 325/5, L.P No. 1803 యం 0.32 సెంట్లు, 10) S.No. 325/3, L.P No. 1807 యం 0.29 సెంట్లు, 11) S.No. 325/6, L.P No. 1808 యం 0.25 సెంట్లు, 12) S.No. 325/6, L.P No. 1809 యం 0.06 సెంట్లు, 13) S.No. 325/6, L.P No. 1810 యం 0.05 సెంట్లు, 14) S.No. 325/3, L.P No. 1812 యం 0.10 సెంట్లు, 15) S.No. 325/8, L.P No. 1816 యం 0.42 సెంట్లు, 16) S.No. 327/2, L.P No. 1822 యం 0.11 సెంట్లు, 17) S.No. 326/5, L.P No. 1844 యం 0.01 సెంట్లు, 18) S.No. 326/5, L.P No. 1845 యం 0.88 సెంట్లు,

19) సంబేపల్లె మండలం, నారాయణరెడ్డిపల్లె గ్రామం మజరా యర్రగుంట్లలో యుండు ఇంటి స్థలం S.No. 329 యం 0.04 సెంట్లు ఇందుకు చెక్కుబంది : **తూ॥** : రోడ్డు, **ప॥** : పెద్దరాములు భూమి, **ఉ॥** : బి.వెంకటేసు ఇల్లు, **ద॥** : బి.నాగులు ఇల్లు, 20) రాయచోటి గ్రామంలో యుండు ఇంటి స్థలం S.No. 843 ఇందుకు చెక్కుబంది : **తూ॥** : స్వామిరెడ్డి ఇల్లు, **ప॥** : వీధి, **ఉ॥** : రామన్న ఇల్లు, **ద॥** : నజీర్‌బాష స్థలం, 21) S.No. 326/5 యం 0.89 సెంట్లు.

ఇట్లు : శ్రీ వి.సి.రెడ్డెప్ప రెడ్డి, M.A., B.L., అడ్వకేట్, రాయచోటి.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

లక్కిరెడ్డిపల్లె : అనంతపురం పంచాయతీ హరిజనవాడ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. అనంతపురం వడ్డెపల్లెకు చెందిన రామయ్య తన కుమారుడు మల్లికార్జున పని నిమిత్తం ఇద్దరూ లక్కిరెడ్డిపల్లె వచ్చి ద్విచక్ర వాహనంలో తిరిగి వెళ్తుండగా హరిజనవాడ వద్దకు రాగానే కుక్క అడ్డురావడంతో ఇద్దరు కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం కడప సర్వజన ఆసుపత్రికి తరలించారు.

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: శివాలయం సర్కిల్ వద్ద గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. అయ్యవారిపల్లె అరుంధతివాడకు చెందిన పి.లక్ష్మమ్మ రోడ్డు దాటుతుండగా ఓ లారీ ఆమెను ఢీకొట్టింది. ప్రమాదంలో ఆమె రెండు కాళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. పోలీసులు ఆమెను స్థానిక ప్రభుత్వాసుపత్రికి అక్కడి నుంచి తిరుపతికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేశామని సీఐ హేమసుందర్‌రావు పేర్కొన్నారు.

తప్పిన ప్రమాదం

చిన్నమండెం న్యూస్‌టుడే : బోడిరెడ్డిగారిపల్లె సమీపంలో ఉన్న అక్కదేవతల కొండపై గురువారం సాయంత్రం పిడుగు పడినట్లు గ్రామస్థులు తెలిపారు. ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చిందని, ఆ సమయంలో కొండ బండపై మంటలు ఏర్పడ్డాయని వివరించారు. అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

నట్టల నివారణకు చర్యలు

చిన్నమండెం, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా జీవాల పెంపకందారులు పశువైద్య సహాయకులు గ్రామాలకు వచ్చినపుడు నట్టలనివారణ మందులను తాపించుకోవాలని పశువైద్యుడు గణేష్ కోరారు. మండల పరిధిలోని సి.పొలిమేరపల్లె గ్రామం బెస్తపల్లెలో జీవాలకు గురువారం మందులు తాపించారు. మండలంలో 45 వేల గొర్రెలు, 6వేల మేకలు ఉన్నట్లు వివరించారు. ఈ నెల 31 లోగా రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే పశు సంవర్ధక శాఖ సహాయకులు ఆయా గ్రామాల పరిధిలోకి వస్తారని, పెంపకందారులు జీవాలకు మందులు తాపించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

వీరబల్లి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని మట్లి సర్పంచి నాగార్జునాచారి పేర్కొన్నారు. యల్లంపల్లి నుంచి బోడిమల్‌రెడ్డి గారిపల్లి వరకు రహదారికి ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కల తొలగింపు కార్యక్రమాన్ని సొంత నిధులతో గురువారం చేపట్టారు. గ్రామస్థులతో కలిసి పర్యవేక్షించారు.

రైతులకు అధికారుల సూచనలు

నందలూరు : ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బ తిన్న పంటలను గురువారం మండల వ్యవసాయాధికారి మల్లికార్జున, రాజంపేట ఉద్యాన అధికారి సురేష్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులకు సూచనలు చేశారు. వరి పొలాల్లో నిలిచిన నీటిని ప్రత్యేక కాలువల ద్వారా వెంటనే బయటకు పంపి, నేలకొరిగిన వరి పైరును కట్టలుగా కట్టి నిలబెట్టుకోవాలన్నారు. అలాగే పంటను కోసిన అనంతరం వరి కుప్పలపై ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ షణ్ముఖ్, వీహెచ్ఏ వరుణ్, రైతులు పాల్గొన్నారు.

బస్సు ఎక్కాలంటే అడుసు తొక్కాల్సిందే!



గాలివీడు ఆర్టీసీ బస్టాండు ఆవరణలో బస్సులు నిలిపే స్థలంలో నీరు నిలవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మురుగు నీటి కాలువ ఉన్నప్పటికీ ప్రవాహానికి పూడిక అడ్డంగా మారడంతో చినుకులు పడితే నీరు వచ్చి చేరడంతో చోదకులు, ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. గాలివీడు మార్గంలో సుమారు 60 సర్వీసులు నడుస్తున్నాయి. దీంతో బస్సు ఎక్కాలంటే ప్రయాణికులు అడుసు తొక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. మట్టి కుప్పలు తొలగించి నీటి నిల్వను మళ్లించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గాలివీడు**

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు



వాల్మీకి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రాజంపేట పురపాలక ఛైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, నాయకులు

వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజవర్గాల వ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన జీవితం యువతకు స్ఫూర్తి దాయకమని కొనియాడారు.

- న్యూస్‌టుడే, రాయచోటి క్లస్టర్ బృందం


మంగంపేటలో వాల్మీకి చిత్రపటానికి అంజలి ఘటిస్తున్న స్థానికులు


వీరబల్లి : వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


రైల్వేకోడూరులో...


రాయచోటిలో...